ANDHRA BHOOMI
SECUNDERABAD ANDHRA PRADESH
Grams "BHOOMI"
Phone: Editorial—72127
Office: Three Lines—72124

Regd. No. [illegible] ఉదయం *

Largest Circulated Telugu Daily Published From The Capital

ఆంధ్రభూమి

ఎడిటర్ : గో రా శా స్త్రి

113154

ఆంధ్రభూమి ప్రకటన రేట్లు
1974 జనవరి 1 నుంచి

క్యాజువల్	149 సెం. మీ. వరకు. సెం.,మీ.	13 4.40
కంట్రాక్టు	150 సెం. మీ.	12 నెలలకు 3.30
కంపెనీ టెండరు, కోర్టు నోటీసులు		5.50
కంపెనీ అధ్యక్షోపన్యాసాలు సెం. మీ.		4.40
ప్యానెల్స్, క్యాజువల్		88.00
కంట్రాక్టు 120 ప్యానల్స్ 12 నెలలకు		27.50

(సర్‌ఛార్జి 20% అదనం)
వివరాలకు: అడ్వర్‌టైజ్‌మెంట్ మేనేజర్

సుగుణ మోటార్సుఅండ్ పంపులు
ఒకసంవత్సరంగ్యారంటీ * ఫోన్ 74808
SUGUNA
నకిలీలనుచూసి మోసపోకండి
ది సన్ యింజనీరింగు కంపెనీ
138 రాష్ట్రపతిరోడ్డు సికింద్రాబాదు-3

సంపుటి : 14 సంచిక 239 * సికిందరాబాద్ 6—6—1974 గురువారం * 4 పేజీలు : 18 పైసలు

నిర్ణీత గడువులోగ రాష్ట్రపతి ఎన్నిక జరిగితీరవలసిందే

ఒకఅసెంబ్లీ రద్దయిఉన్నా నియోజకవర్గానికి భంగం రాదని సుప్రీంకోర్టు అభిప్రాయం

న్యూఢిల్లీ, జూన్ 5 (పి.టి.ఐ)

గుజరాత్ అసెంబ్లీ రద్దయి ఉండటంతో నిమిత్తం లేకుండానే నిర్ణీత సమయంలోపల రాష్ట్రపతి పదవికి ఎన్నిక జరిపించి తీరాలని సుప్రీంకోర్టు రాజ్యాంగ సరబంధమైన ఏడుగురుసభ్యుల ప్రత్యేకబెంచి నేడు ఏకగ్రీవాభిప్రాయాన్ని ప్రకటించినది.

రాష్ట్రపతి ఐదేళ్ల పదవీకాలం ఆగస్టు 24వ తేదీతో ముగుస్తుంది. ఆలోపల కొత్త రాష్ట్రపతి ఎన్నిక జరగాలి.

కోర్టు "అభిప్రాయాన్ని" ప్రధాన న్యాయమూర్తి శ్రీ అజిత్‌నాథ్‌రే చదివి వినిపించారు. ఈ అభిప్రాయం 27 పేజీలతో కూడుకొని ఉన్నది. రాజ్యాంగం 143(1) ఆర్టికల్‌ననుసరించి సుప్రీంకోర్టు సలహా పూర్వకమైన అభిప్రాయాన్ని తెల్పవలసినదిగా రాష్ట్రపతి కోరినందున కోర్టు ఈ అభిప్రాయాన్ని తెలిపినది.

గుజరాత్ అసెంబ్లీ రద్దయి ఉన్నందున రాష్ట్రపతి ఎన్నిక జరిపించడానికి రూపొందించబడే "నియోజకవర్గం" అసంపూర్ణం అవుతుందని ఆ కారణంతో ఎన్నిక వాయిదా పోతుందనీ ఒక వివాదం తలెత్తినందున ప్రభుత్వం కోర్టు సలహాను కోరినది.

రాష్ట్రపతి కోర్టును ఆరు అంశాలు స్పష్టపరచవలసినదిగా కోరారు. ఒక రాష్ట్ర అసెంబ్లీ కాని, కొన్ని రాష్ట్రాల అసెంబ్లీలు కాని రద్దయిఉన్నప్పటికీ వాటితో నిమిత్తం లేకుండానే ప్రస్తుత రాష్ట్రపతి పదవీకాలం ముగిసే లోపల కొత్త రాష్ట్రపతి ఎన్నిక జరిపించి తీరాలా అనే విషయాన్ని ప్రత్యేకించి శుభ్రం చేయాలని రాష్ట్రపతి కోర్టును కోరారు.

రాష్ట్రపతి పదవీ కాలం ముగియక ముందే కొత్త రాష్ట్రపతి ఎన్నిక జరిగితీరాలనీ, ఆ సమయంలో ఏ ఒక్క రాష్ట్రంలో నైనా అసెంబ్లీ లేకపోయినా పర్వాలేదని కోర్టు అభిప్రాయ మిచ్చినది.

(1) ఒక అసెంబ్లీనో లేక కొన్ని అసెంబ్లీలనో దురుద్దేశ్యంతో రద్దు చేసినప్పుడు పరిస్థితి ఏమిటి? (2) సమయం ఉన్నప్పటికీ ఉద్దేశ్య పూర్వకంగా ఏదేని అసెంబ్లీకి ఎన్నికలు జరిపించ కుండా వాయిదా వేసినప్పుడు పరిస్థితి ఏమిటి? అనే ప్రశ్నలపై కోర్టుఅభిప్రాయాన్ని ప్రకటించినది. దానికి నిరాకరించినది ఈరెండు ప్రశ్నలు ప్రస్తుత కేసులో ఉత్పన్నంకావు అని అభిప్రాయపడినది. ఇక మూడవ ప్రశ్న రాష్ట్రపతి ఎన్నిక జరిగే సమయంలో చాలా అసెంబ్లీలు రద్దయి ఉంటే పరిస్థితి ఏమిటి అన్నది. దీని పై కూడా కోర్టు తన అభిప్రాయం తెల్పడానికి నిరాకరించినది.

ఈ కేసులో అభిప్రాయమివ్వడానికి నిరాకరించాలని జనసంఘం అధ్యక్షుడు శ్రీ యల్. కె. అద్వాని చేసిన సూచనను కోర్టు అంగీకరించలేదు.

ఆరు ప్రశ్నలకు సమాధానాలు

ప్రభుత్వం కోర్టు పరిశీలనకు పంపిన ఆరు ప్రశ్నలకు సమాధానాలను కోర్టు ఈ విధంగా ఇచ్చినది.

ఆర్టికల్ 54 ప్రకారం రాష్ట్రపతి ఎన్నికకు సంబంధించిన "నియోజక వర్గంలో" పార్లమెంట్ ఉభయ సభలు, రాష్ట్రాల అసెంబ్లీలు అంతర్భాగాలు కావు. ఆ సభలలోని ఎన్నికైన సభ్యులు మాత్రమే నియోజక వర్గం సభ్యులు అవుతారు. రాష్ట్రపతి ఎన్నిక జరిగే నాటికి నియోజక వర్గంలో ఒకటైన "ఖాళీ" ఎన్నికైన సభ్యులు అనే అర్థత ఉండితీరాలి.

(2) ఆర్టికల్ 55లో పేర్కొన్న సమానత్వ సూత్రం ఒక్కో రాష్ట్రానికి, కేంద్రానికి మధ్య నిష్పత్తిని కాక రాష్ట్రాలన్నిటికీ కలిపి ఏకమొత్తం కేంద్రంతో ఉండవలసిన నిష్పత్తిని పేర్కొంటున్నది.

(3) ఆర్టికల్ 55 (1)లో "సాధ్యమైనంత మేరకు" అనే మాటలు వాడారంటే ఎన్నిక రోజున నియోజక వర్గంలో నిజంగా ఉన్న సభ్యుల సంఖ్యా పార్లమెంట్ రాష్ట్రాల అసెంబ్లీలు అన్నిటిలో కలిపి ఎన్నికైన సభ్యుల సంఖ్యతో సమానంగా ఉండక పోవచ్చునని సూచిస్తున్నాయి.

(4) 62వఆర్టికల్ రాజ్యాంగ లక్ష్యాన్ని నిర్దేశిస్తున్నది గనుక తప్పనిసరిగా పాటించి తీరవలసినది.

(5) రాజ్యాంగం 11వ సవరణ చట్టం ద్వారా 71వ ఆర్టికల్‌లో చేర్చిన 4వ క్లాజు ఖర్ కేసు తర్వాతతీసుకురాబడినది. నియోజక వర్గంలో ఖాళీ అనేది ఏ కారణం చేత ఉన్నా రాష్ట్రపతిఎన్నికనుమాత్రం సవాలు చేయడానికి వీలులేదు అని స్పష్టపరచడం దాని లక్ష్యం.

(6) రాష్ట్రపతి కోర్టు పరిశీలనకు ఒక అంశాన్ని పంపుతూ దానితోపాటు జత పరచిన కారణాల లక్ష్యాల పట్టికను కోర్టు సరియైనదిగా అంగీకరించితీరాలి. ఆ కారణాలు, లక్ష్యాలు నిజమా కాదా అనే చర్చలోకి కోర్టు వెళ్ళడానికి వీలులేదు. అలాగే ఏ ఉద్దేశ్యంతో కోర్టును అభిప్రాయం చెప్ప

(మిగతా 2వ పేజీలో)

సుప్రీంకోర్టు రికార్డు

న్యూఢిల్లీ, జూన్ 5 (పి.టి.ఐ.)

సుప్రీంకోర్టు ప్రత్యేక బెంచి రాష్ట్రపతి ఎన్నిక సమస్యపై తమ అభిప్రాయాన్ని ప్రకటించడంలో ఒక రికార్డును సృష్టించినది. విచారణ పూర్తయిన నాలుగురోజులలో కోర్టు తమ అభిప్రాయాన్ని ప్రకటించినది.

విచారణకు కోర్టు ఐదురోజుల సమయం మాత్రమే తీసుకున్నది. మొదట వాదోపవాదాలు వినడానికి ఎనిమిది రోజులు కేటాయించారు. ఈ ఐదురోజులలోనే అటార్నీ జనరల్, ఎన్నికల కమిషన్, అరడజన్ రాష్ట్రాలు. నాలుగు రాజకీయ పార్టీలు కోర్టుముందు తమ అభిప్రాయాలను తెలిపినవి.

కోర్టు ఏకగ్రీవ అభిప్రాయం 27 పేజీలకు విస్తరించినది. దీన్ని చదవడానికి ప్రధాన న్యాయమూర్తికి 50 నిమిషాలు పట్టింది.

కృష్ణలో మిగులు నీటి పంపిణీకి అర్స్ సూచన

బెంగుళూరు, జూన్ 5 (పి.టి ఐ.)

కృష్ణలో మిగులు నీరును 25 సంవత్సరాలవరకు వేచిఉండటం కాకుండా ఇప్పుడే రాష్ట్రాలమధ్య పంపిణీ చేయాలని కర్ణాటక ముఖ్యమంత్రి శ్రీ దేవరాజ్ అర్స్ నేడు సూచించారు.

శ్రీ అర్స్ ట్రిబ్యునల్ అవార్డు ప్రతిని సభకు సమర్పించడానికి నేడు నిరాకరించారు దాన్ని కేంద్రం ఇంకా అధికారికంగా ప్రకటించలేదని ఆయన చెప్పిన కారణం. ఈఅవార్డు ప్రకారం కర్ణాటకకు కృష్ణా జలాలలో 695 శతకోటి ఘనపుటడుగుల నీరు కేటాయించబడింది.

పాలిటెక్నిక్ విద్యార్థుల సమ్మె విరమణ

(ఆంధ్రభూమి ప్రతినిధి)

హైదరాబాద్, జూన్ 5

రాష్ట్రంలోని పాలిటెక్నిక్ విద్యార్థుల కేంద్ర కార్యాచరణ సమితి, మేనెల 14వ తేదీన ప్రారంభించిన నిరవధిక సమ్మె విరమణకు నేడు పిలుపు ఇచ్చినది.

విద్యార్థుల కోర్కెలను పరిశీలించడానికి సాంకేతిక విద్యాశాఖ హామీఇచ్చినందుపల సమ్మె విరమణకు పిలుపు ఇచ్చినట్టు హైదరాబాద్ ప్రభుత్వ పాలిటెక్నిక్ విద్యార్థి సంఘం ప్రధాన కార్యదర్శి శ్రీ బి. పి. మధురాజ్ ఒక పత్రికా ప్రకటనలో వివరించారు.

బొలీవియాలో సైనిక తిరుగుబాటు అణచివేత

లాపాజ్, జూన్ 5 (రాయిటర్)

సాయుధ కవచశకటాల విభాగం జరిపిన తిరుగుబాటును బొలీవియా ప్రభుత్వం అణచివేసిందనీ, పరిస్థితి పూర్తిగా అదుపులో ఉన్నదనీ జాతీయాంగశాఖ ప్రకటించింది.

రాజధాని నగరంలోని ముఖ్యమైన కూడలిలో పెద్దఎత్తున సైనిక దళాల కాపలా ఏర్పాటు చేశారు.

సైనికదళాల కేంద్ర కార్యాలయంలో, సైనిక బారెక్స్‌లో నివసిస్తున్న సైనికాధికారులు, సైనికుల కుటుంబాలను ఖాళీచేయించారు

తిరుగుబాటుదారులు టాంకు సహాయంతో అధ్యక్షసౌధం, ప్రాకారాన్ని కూలదోసి, లోపలికి ప్రవేశించి ప్రభుత్వాధిపత్యం చేపట్టినట్టు రేడియోద్వారా ప్రకటించారు. ఆ పిమ్మట దేశీయాంగశాఖ జారీచేసిన ప్రకటన తిరుగుబాటును అణచివేసినట్టు పేర్కొన్నది.

సిరియా-ఇజ్రేల్ ఒప్పందంపై సంతకాలు

జెనీవా, జూన్ 5 (రాయిటర్)

గోలన్‌గుట్టల ప్రాంతంలో సంఘర్షణలు జరుగుతున్న ప్రాంతాల నుండి ఉభయ పక్షాల బలాల ఉపసంహరణ, యుద్ధఖైదీల విడుదల మృతుల దేహాల అప్పగింతకు వీలు కల్పించే ఒప్పందంపై సిరియా, ఇజ్రేల్ నేడు సంతకాలు చేశాయి.

వారంరోజులలో రాజీనామా చేయాలని బీహార్ శాసనసభ్యులకు అల్టిమేటమ్

పాట్నానగరంలో బ్రహ్మాండమైన ఉరేగింపు: ప్రదర్శకులపై ఇందిరాబ్రిగేడ్ సభ్యుల కాల్పులు

పాట్నా, జూన్ 5 (పి.టి.ఐ)

జూన్ 12లోగా బీహార్ విధాన సభ సభ్యులందరూ రాజీనామా చేయనిపక్షంలో శాసన సభ్యుల ఇండ్లముందు ఛాత్ర సంఘర్షసమితి ధర్నా చేయగలదని సర్వోదయ నాయకుడు జయప్రకాశ్ నారాయణ్ నేడు ప్రకటించారు.

స్థానిక గాంధీ మైదాన్‌లో జరిగిన పెద్ద బహిరంగసభలో ప్రసంగిస్తూ జయప్రకాశ్ నారాయణ్ బీహార్ విధాన సభను రద్దుచేయాలని, తిరిగి ఎన్నికలు జరిపించాలని కోరుతూ ఈ నెల 7వ తేదీనుండి బీహార్ విధానసభ నాలుగుగేటవద్ద ధర్నా జరుగగలదని ప్రకటించారు.

శాసన సభ్యుల ఇండ్లముందు ధర్నా చేసేవారు శాసన సభ్యుల కుటుంబ సభ్యుల రాకపోకలకు అంతరాయం కలిగించరని శాసన సభ్యులు విధాన సభకు హాజరుకాకుండా అటకాయిస్తారని ఆయన తెలిపారు.

విద్యార్థులు మరో సంవత్సరం పాఠశాలలకు, కళాశాలలకు హాజరు కాబోరని కొత్త విప్లవానికై వారు తమ కాలాన్ని వినియోగిస్తారని విద్యార్థులు జైళ్ళకువెళ్లడానికి భయపడరాదని జైళ్ళనుండే స్వరాజ్యం ఆవిర్భవించిందని జయప్రకాశ్ తెలిపారు. ఈ విప్లవాన్ని గ్రామాలనుండి రాష్ట్రస్థాయికి వ్యాపింప చేయాలని రైతులు భూమిశిస్తు చెల్లించరాదని ఇప్పటివరకు విద్యార్థులు బీహార్ మంత్రివర్గం రాజీనామాను కోరలేదని మార్చి 18 నుండి మారిన పరిస్థితులను బట్టి ఈ ప్రభుత్వానికి నైతికంగా అధికారంలో ఉండే హక్కులేదని విద్యార్థుల ఉద్యమాన్ని ప్రభుత్వం అణచివేయ దలుస్తున్నదని జయప్రకాశ్ అన్నారు.

పాట్నా వీధులలో ఊరేగింపు

సర్వోదయ నాయకుడు జయప్రకాశ్ నారాయణ్ నాయకత్వంలో పాట్నా నగర వీధులలో నేటి మధ్యాహ్నం పెద్ద ఎత్తున ఊరేగింపు తీశారు. బీహార్ విధానసభను రద్దు చేయాలని అర్ధాంతర ఎన్నికలు జరుపాలని ప్రదర్శకులు నినాదాలుచేశారు. ఛాత్ర సంఘర్ష సమితి ఏర్పాటు చేసిన ఈ ఊరేగింపు గాంధీమైదానంనుండి ప్రారంభమైనది. సమితి బ్యానర్‌గల ట్రక్కు ఊరేగింపు ముందు నడువగా దాని వెంట వట్టి జీపు తడ వేసిన జీపులో జయప్రకాశ్ నారాయణ్ ప్రయాణించారు. ఏప్రిల్ 12న గయలో జరిగిన పోలీస్‌కాల్పులల దృశ్యం గల చిత్రం, విధానసభ రద్దును కోరుతూ కోటి మంది సంతకాలు కల మహా విజ్ఞాపన

(మిగతా 2వ పేజీలో)

సచివాలయ సిబ్బంది సమ్మెపై పోలీస్ ఎన్.జి.ఓ.ల విమర్శ

(ఆంధ్రభూమి ప్రతినిధి)

హైదరాబాద్, జూన్ 5

సెక్రెటేరియెట్‌లోని ఒక సైనోగ్రాఫరును పోలీసులు వెధించారనే మిషపై సెక్రెటేరియెట్‌లోని ఎన్.జి.ఓ. ల సంఘం ఆకస్మిక సమ్మెకు దిగి తప్పుచేయని పోలీస్ ఎన్ జి.ఓ. లపై ప్రభుత్వం చర్య తీసుకొనేలా ఒత్తిడి తేవడం శోచనీయమని ఆంధ్రప్రదేశ్ పోలీస్ ఎన్.జి.ఓ.ల సంఘం నేడు విమర్శించింది. పోలీస్ శాఖలోని తోటి ఎన్. జి. ఓ. లను అపఖ్యాతిపాలు చేయడానికి ఈవిధంగా ప్రయత్నించడం సమంజసంకాదని పోలీస్ ఎన్. జి. ఓ. ల సంఘం పేర్కొన్నది.

పోలీస్ ఎన్. జి. ఓ. ల సంఘం అధ్యక్షులు కె భుజంగరెడ్డి ఒక పత్రికా ప్రకటనలో ఈవ్యవహారానికి సంబంధించిన అధికారిపై చర్య తీసుకొనడానికిముందు ప్రభుత్వం నిష్పాక్షిక విచారణను జరిపించాలని ప్రభుత్వాన్ని కోరారు.

ఒక ముఖ్యమైన పైలును దొంగిలించాడని అనుమానింపబడుతున్న ఒక సెక్రెటేరియెట్ ఉద్యోగిపై దర్యాప్తు చేస్తున్న పోలీసులకు చెడు పేరు తేవడానికి సెక్రెటేరియెట్ ఎన్. జి. ఓ. ల సంఘం ప్రయత్నించినదని ఆయన అన్నారు. పోలీసులు ప్రభుత్వ ఇతర శాఖల ఉద్యోగుల మధ్య సామరస్య సంబంధాలుండేవని మంచి సంబంధాలు ఏర్పడటానికి ప్రభుత్వమూ సెక్రెటేరియెట్ సిబ్బంది తగు చర్యలు తీసుకొనాలని భుజంగరెడ్డి కోరారు.

సెక్రెటేరియెట్ ఉద్యోగుల సంఘాల ప్రకటన

సెక్రెటేరియెట్ లోని ఉద్యోగుల సంఘాలు ఒక సంయుక్త ప్రకటనలో నేడు పోలీస్‌వారు జారీచేసిన ప్రకటనపై విచారాన్ని వ్యక్తంచేశాయి. ప్రభుత్వం ఈ వ్యవహారాన్ని సవ్యంగా తేల్చివేసిన తర్వాత ఏర్పడిన శాంతియుత వాతావరణాన్ని భంగపరచేవిధంగా ఈ ప్రకటన ఉన్నదని ఈవ్యవహారాన్ని న్యాయవిచారణకు నివేదించిన తర్వాత దురుద్దేశాలను అంటగట్టడం తగనిపని అని ఈ సంఘాలు అభిప్రాయపడినవి. ఇట్టి ప్రకటనలు కవ్వించేవిగా ఉంటాయని అనుమానాలను వ్యాపింపచేస్తాయని ఈ సంఘాలు తమ ప్రకటనలో సూచించాయి.

ఈ ప్రకటనను ఆంధ్రప్రదేశ్ సెక్రెటేరియెట్ అసోసియేషన్, తెలంగాణా ఎన్.జి.ఓ.ల సంఘం సెక్రెటేరియెట్ శాఖ ఆంధ్రప్రదేశ్ సెక్షన్ ఆఫీసర్ల సంఘం, సెక్రెటేరియెట్ నాలుగవ తరగతి ఉద్యోగుల సంఘం. జారీచేశాయి.

జనసంఘం నుండి ఎనమండుగురి రాజీనామా

పాట్నా, జూన్ 5 (పి.టి.ఐ)

నేడు పార్టీ సభ్యత్వానికి రాజీనామా ఇచ్చిన బీహార్ జనసంఘం శాసనసభ్యులు ఎనమిదిమంది విధానసభలో ఇందిరా కాంగ్రెస్‌లో వ్యవహరించడానికి నిర్ణయించుకున్నారని మాజీమంత్రి శాసనసభ్యుడైన రమణందన్‌ప్రసాద్ తెలిపారు.

రమణందన్‌ప్రసాద్ కాక మిగతా ఏడుగురు రామ్‌జీప్రసాద్‌సింగ్, కమలేశ్వర్ పాశ్వాన్, అవధ్‌బిహారీసింగ్, చంద్రేశ్వర్ ప్రసాద్, రామ్‌తహల్ చౌదరి, రామశరాయ్ రాయ్, మహేశ్‌రాయ్ వీరు తమనిర్ణయాన్ని రాష్ట్ర జనసంఘం అధ్యక్షునికి తెలియచేశారు.

ప్రొఫెసర్ అనిరుద్ధ్ రూ నిన్న పార్టీ నుండి వైదొలగారు.

భారతీయ జనసంఘ్ కేంద్ర కార్యవర్గం పార్టీ శాసనసభ్యులందరూ రాజీనామాచేయాలని కోరినది. ఇరువదినాలుగుమంది బీహార్ జనసంఘ శాసన సభ్యులలో పన్నెండు మంది రాజీనామా ఇచ్చారు.

రాష్ట్రపతి ఢిల్లీకి తిరిగిరాక

న్యూఢిల్లీ, జూన్ 5 (పి.టి.ఐ)

భూటాన్‌రాజు పట్టాభిషేకానికి హాజరైన రాష్ట్రపతి శ్రీ వి. వి. గిరి నేడిక్కడికి తిరిగి వచ్చారు.

భూసంస్కరణల చట్టం అమలుకు ఇప్పట్లో అవకాశం లేని సూచన

(ఆంధ్రభూమి ప్రతినిధి)

హైదరాబాదు, జూన్ 5

వ్యవసాయ భూకమతాలపై గరిష్ఠ పరిమితి విధింపు చట్టం అమలుకు ఈసంవత్సరమే అవసరచర్యలు ప్రారంభించే అవకాశాలు అంతగా లేవని, బహుశా వచ్చే సంవత్సరం మార్చి లేక ఏప్రిల్‌లో భూసంస్కరణల కార్యక్రమాన్ని చేపట్టడం జరుగవచ్చునని ఇక్కడ వెల్లడైన సూచనలను బట్టి తెలుస్తున్నది.

అందుకు ప్రధాన కారణం భూసంస్కరణల చట్టాన్ని రాజ్యాంగం తొమ్మిదవ షెడ్యూలులో చేర్చడంలో జాప్యమే. రాజ్యాంగాన్ని సవరిస్తేగాని ఇది జరగడానికి వీలేదు.

సవరణ బిల్లును పార్లమెంటు గత సమావేశంలోనే ప్రవేశపెట్టినప్పటికీ వ్యవధిలేక ఇప్పటికి దానిని ఆమోదించడం జరుగలేదు.

వచ్చే జూలైలో జరిగే పార్లమెంటు సమావేశంలో గుజరాత్ బడ్జెట్ ఆమోదించవలసి ఉంది. ఆగస్టు ఆఖరులోపల ఆమోదించవలసిన కొన్ని బిల్లులున్నాయి. అటువంటప్పుడు సవరణ బిల్లు ఆగస్టు ఆఖరులోనో సెప్టెంబరులోనో పార్లమెంటు పరిశీలనకు రావచ్చు. ఆ తర్వాత దానిని రాష్ట్రపతి ఆమోదించాలి. అది అప్పుడు అనగా అక్టోబరులోగానే రాష్ట్ర ప్రభుత్వానికి అందదు. చట్టాన్ని అమలుపరచడానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రాథమిక సన్నాహాలు చేసుకోవడానికి కనీసం మూడుమాసాలైనా పడుతుంది. ఆమీదట కమతాల వివరిస్తూ ప్రకటనలు దాఖలు చేయవలసిందిగా కోరుతూ రెండు, మూడు నెలల వ్యవధిఇచ్చి నోటీసులు జారీ చేయాలి. కమతాల ప్రకటనలు దాఖలైన తర్వాత భూస్వాములవద్ద అదనపు భూమి ఎంత లభించగలదో తెల్పడానికి ట్రిబ్యునళ్ళను నియమించాలి. ఇదంతా జరిగేటప్పటికి వ్యవహారం వచ్చే సంవత్సరం మార్చి, ఏప్రిల్‌దాకా పోతుంది.

భూకమతాల పరిమితి విధింపు చట్టాన్ని రాష్ట్ర శాసనసభలు 1972 సెప్టెంబరులో ఆమోదించాయి. రాష్ట్రపతి గత డిసెంబరులో ఆమోదించి 1973 ఫిబ్రవరిలో కొన్ని సూచనలతో అసెంబ్లీకి తిప్పిపంపారు.

కిసింజర్ పర్యటన తేదీ అనిశ్చితం

న్యూఢిల్లీ, జూన్ 5 (పి.టి.ఐ

అమెరికా విదేశాంగమంత్రి కిసింజర్ భారతదేశ పర్యటన తేదీగురించి అమెరికా ఇంతవరకు తెలియ పరచలేదు. పర్యటన తేదీయే నిర్ణయం కానందున అది వాయిదా పడినట్టు పత్రికలలో వెలువడిన వార్తలు అర్థరహితమని అధికారవర్గాలవారు తెలిపారు.

కుట్రకేసు నిందితులకు బెయిల్ నిరాకరణ

(ఆంధ్రభూమి ప్రతినిధి)

సికిందరాబాద్, జూన్ 5

విప్లవ రచయితలతోసహా సికిందరాబాద్ కుట్రకేసులోనిందితులైన పదకొండు మంది కి నగరమేజిస్ట్రేట్ శ్రీ ఎం. రాజయ్య జామీను నిరాకరించారు.

యావజ్జీవ కారాగారశిక్ష విధించదగిన నేరాలకు ఈ నిందితులు తలపడియుండవచ్చునని భావించడానికిగల ఆధారాల దృష్ట్యా జామీను దరఖాస్తులను మేజిస్ట్రేట్ తోసిపుచ్చారు.

జామీను దరఖాస్తు పెట్టుకున్న నిందితుల పేర్లు: శ్రీ మధుసూదనరావు (విప్లవ రచయితలసంఘం ప్రధానకార్యదర్శి) తిరుపతిలోని గోవిందరాజులు కాలేజి అధ్యాపకుడు) శ్రీ పెండ్యాల వరవరరావు (విప్లవకవి), వరంగల్‌లోని చందాకాంతయ్య మెమోరియల్ కాలేజి, లెక్చరర్,) శ్రీ ఎం. రంగనాథం ("పిలుపు" వారపత్రిక ఎడిటర్, శ్రీ ఎం. టి. ఖాన్ ("పిలుపు" పబ్లిషర్, ధర్మపంత్ హైస్కూల్ అధ్యాపకుడు)ః చెరబండరాజు అను బద్రం భాస్కరరెడ్డి విప్లవకవి, మలక్‌పేటు గవర్నమెంటు జూనియర్ కాలేజి అధ్యాపకుడు), శ్రీ వి. కోదేశ్వరరావు (భారత-చైనా మైత్రీ సంఘంఖమ్మం శాఖ కార్యదర్శి, శ్రీ బి. మల్లయ్య, శ్రీ గోపాల్‌రెడ్డి, శ్రీ శివప్రసాద్, శ్రీ రామమోహనరావు, శ్రీ నారాయణరెడ్డి.

శ్రీ మధుసూదనరావు కూతురు లారీ ప్రమాదంలో మరణించినందువల్ల ఇది వరకే క్షయవ్యాధి పీడితురాలైన ఆయన భార్య మతిస్థిమితం కోల్పోయినదనీ అందువల్ల ఆయనను జామీనుపై విడుదలచేసి పంపాలని అతని అడ్వొకేట్ వాదించారు.

అడ్వొకేట్లు శ్రీ పి. వెంకేశ్వర్లు, శ్రీ రావి సుబ్బారావు, శ్రీ సి. వెంకటకృష్ణ నిందితులపక్షాన వాదించారు. ప్రభుత్వం తరపున పబ్లిక్ ప్రాసిక్యూటర్ శ్రీ వి. సత్యనారాయణరాజు వాదించారు.

ఎక్సైజ్ నిఘా విభాగం డైరెక్టర్ నియామకం

(ఆంధ్రభూమి ప్రతినిధి)

హైదరాబాద్, జూన్ 5

సారాక్ష్రీ నిరోధానికై రాష్ట్ర అగ్నిమాపకదళశాఖ డైరెక్టర్ శ్రీ ఎమ్.ఇ. రెడ్డిని ఎక్సైజ్‌శాఖ నిఘా విభాగం డైరెక్టర్‌గా నియమించాలని ప్రభుత్వం నిశ్చయించినప్పటికీ ఆకొత్త డైరెక్టరేట్ కార్యక్రమాలు ప్రారంభం కొంత ఆలస్యం కావచ్చునని అనుకుంటున్నారు.

కొత్త డైరెక్టరేట్ విధులను గురించి సిబ్బంది అవసరాలను గురించి శ్రీ ఎమ్. ఇ. రెడ్డి తమ ప్రతిపాదనలను ప్రభుత్వానికి అందజేస్తారు.

ప్రస్తుతం డైరెక్టర్‌కు సంబంధించిన ఖర్చులనుమాత్రమే ప్రభుత్వం మంజూరు చేసింది. కార్యాలయసిబ్బంది ఖర్చులను గురించి ఇంకా ఏమీ నిర్ణయించలేదు.

కొత్త డైరెక్టరేట్‌లో నియమింపబడదానికై ఎక్సైజ్, పోలీస్‌శాఖల ఉద్యోగులు ఎవరికి వారు తమకే అవకాశం ఉందని భావిస్తున్నారు.

తుపాకిచూపి లక్షా 63వేలు అపహరణ

లూధియానా, జూన్ 5

జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో క్యాషియర్ మాధ్యమిక పాఠశాలల అధ్యాపకులకు జీతాలు ఇవ్వడానికై బ్యాంక్ నుండి సొమ్ము తీసుకువస్తుండగా ముగ్గురు దుండగులు నిన్న తుపాకిచూపి క్యాషియర్ నుండి లక్షా 63వేల రూపాయల సగదుగల సంచీని అపహరించారు.

పోలీసులు నిందితులకై అన్వేషిస్తున్నారు.

తీవ్ర గలభా మధ్య బీహార్ విధానసభ సమావేశం

పాట్నా, జూన్ 5 (పి.టి.ఐ)

బీహార్ విధాన సభను రద్దు చేయాలనే విద్యార్థులు, యువజనులు, పతిపక్ష పార్టీల ఉద్యమం ఉధృతమౌతున్న తరుణంలో విధానసభ సమావేశం నేటి మధ్యాహ్నం 11 గంటలకు గలభాతో ప్రారంభమైనది

గత మార్చి 18న విధానసభ సమావేశమైనప్పుడు అసంఖ్యాకంగా విద్యార్థి సమూహాలు మెరవ చేయడంతో, పాట్నాలో, రాష్ట్రంలోని తదితర ప్రాంతాలలో తీవ్ర కల్లోలాలు చెలరేగిన ఫలితంగా కాల్పులు 85 మంది మరణించటానికి. పలువురు గాయపడడానికి దారితీసింది. అటువంటి కల్లోల పరిస్థితులలో ఏప్రిల్ 8న విధాన సభ సమావేశాలు నిరవధికంగా వాయిదా పడినవి.

స్పీకర్ నేటి సమావేశారంభంలో సభ్యులకు స్వాగతం చెప్పడానికి ఉత్సాహమించడంతోనే ఎన్. ఎన్. పి సభ్యుడు శ్రీ బాబులాల్ శాస్త్రి లేచి నిలబడి, పార్లమెంటు సభ్యుడు శ్రీ రాజ్‌నారాయణ్ పభుత్వం జారీచేసిన బహిష్కరణ ఉత్తర్వు విషయం ప్రస్తావించారు. ఆపిమ్మట సభలో కెలరేగిన గలభాలో ఆయన చెప్పినదేమిటో వినిపించలేదు.

విధానసభ సభ్యత్వానికి తన రాజీనామా లేఖను చదివి వినిపిస్తూ, విధానసభను రద్దు చేసి మధ్యాంతర ఎన్నికలు జరపాలని శ్రీ శాస్త్రి కోరారు. పసంగంఆపి కోరో వలసిందని స్పీకర్ పెక్కు పర్యాయాలు చెప్పినా లక్ష్య పెట్టకుండా ఆయన సభలో నుండి వెళ్ళిపోయారు.

కాంగెస్ పార్టీకి, విధానసభ సభ్యత్వానికి రాజీనామా చేసిన మాజీ ముఖ్యమంత్రి శ్రీ మహామాయా ప్రసాద్ సిన్హా నేటి సమావేశానికి హాజరుకాలేదు. గైర్‌హాజరైన వారిలో మాజీ ముఖ్యమంత్రి కర్పూరీ ఠాకూర్, జనసంఘ గ్రూపు నాయకుడు శ్రీ విజయ్‌కుమార్ మిశ్రా, మాజీ స్పీకర్ శ్రీ దినిక్‌లాల్ మండల్‌కూడా ఉన్నారు. వారంతా విధానసభ సభ్యత్వానికి రాజీనామా చేశారు శాసనసభ సభ్యత్వానికి రాజీనామాచేయకపోయినప్పటికీ ప్రతిపక్ష

(మిగతా 2వ పేజీలో)

గోధుమ సరఫరా విధానం వైఫల్యం

సరుకు అందుబాటులోకి రాక ధరలు పెరుగుతున్న స్థితి

న్యూఢిల్లీ, జూన్ 5 (పి. టి ఐ)

గోధుమల సరఫరా విషయంలో ప్రభుత్వం నూతనంగా రూపొందించిన విధానం వల్ల ధరలుతగ్గి, సరఫరా మెరుగై వినియోగదారుకు లాభించడానికి బదులు పరిస్థితి మరింత విషమించిందని పి.టి.ఐ. సర్వే రిపోర్టులో వెల్లడైనది.

దేశమంతటా స్వేచ్ఛా మార్కెట్లో గోధుమల ధరలు గత సంవత్సరం కంటే పెరిగిపోయాయి. పంజాబ్, హర్యానా, రాజస్థాన్, మధ్యప్రదేశ్, ఉత్తర ప్రదేశ్, జమ్మూ అయిదు గోధుమ మిగులు రాష్ట్రాలలో మార్కెట్లో గోధుమలు రావడం బాగా తగ్గిపోయింది. గోధుమల సేకరణ కూడా బాగా తక్కువగా ఉంది.

యు. పి. లో గత మూడు నాలుగు రోజులలో ప్రభుత్వం గట్టిగా వ్యవహరించడం వల్ల మార్కెట్లోకి గోధుమలురావడం తద్వారా ధరలు పడిపోవడం జరిగింది. బోకు సర్వరుల వద్ద నిల్వల పరిమితిని రెండువేల క్వింటాళ్ళనుండి వెయ్యి టన్నులకు చిల్లర వర్తకులవద్ద నిల్వల పరిమితిని 250 నుండి పందక్వింటాళ్ళకు తగ్గించడం అంటేకాకుండా ఏరోజు 15 క్వింటాళ్ళకంటె ఎక్కువగా నిల్వ పెట్టుకోవడానికి వీల్లేదని ఆంక్షలు విధించడం, ఒక జిల్లా నుండి షరో జిల్లాకు రవాణా పై నిషేధం విధించడంతో పరిస్థితి మారిపోయింది.

అత్రప నిల్వలపై నేరుగా ప్రభుత్వ ధికారుల సహాయంతో సేకరణ మొదలైన చర్యల వల్ల సరఫరాలు కలగడం మానేశారు ఆహార శాఖ సహాయ మంత్రి శ్రీ ఎ. పి. షిండే కూడా ఇతర రాష్ట్రాలపై యు. పి. ని అను

పంచాంగం

గురువారం, జూన్ 6

స్వస్తిశ్రీ దాందమాన ఆనందనామ సంవత్సర జ్యేష్ఠ కృష్ణ విదియ ది వారా త ములు భూర్మి మూల రా తి గం. 12–54 నిం॥. వరకు తర్వాత పూర్వషాఢ వర్జ్యం ఉదయం గం. 7.17 నిం॥ల నుండి గం. 9–02 నిం॥ల వరకు.

దిన మంతయు సర్వసాధారణముగా శుభము.

ఉదయము ప్రయాణములకు, ఉద్యోగ ప్రయత్నములకు క్రీడారంగ సంబంధ విషయములకు శుభము

మధ్యాహ్న సాయంసమయములు వ్యాపారపు ఒప్పందములకూ బహిరంగ సభలకు శుభము.

వ్యాపార రంగం:– వెండి బంగారములు యథాతథముగానుండును. నూనెలు, నూనెగింజలు, పత్తి, జనపనార స్టాకులు షేర్ల ధర పెచ్చును.

ఆంధ్రభూమి

గురువారం, జూన్ 6

అంతులేని అసమర్థత

కేంద్ర ప్రభుత్వానికి అసలు ఒక ఆహారవిధానమంటూఉన్నదా అనిఅనుమానం కలుగుతున్నది. ఒకవేళఅలాంటి విధానం ఏదైనా ఉంటే దాన్ని అమలు జరుపడానికికావలసినసత్తా ప్రభుత్వానికున్నదా అని మళ్లీఅనుమానం కలుగుతున్నది:–అనగా సారాంశం పాలకులకు సక్రమంగా పరిపాలించే శక్తిఉన్నదా! ప్రముఖ జాతీయ వార్తాసంస్థ గోధుమల సరఫరా విషయంలో తాజాగా ఒక దర్యాప్తు జరిపి రిపోర్టుప్రకటించింది:– అందులోని యదార్థాన్ని కాదనడానికి వీల్లేదు:– ఆ నివేదిక ప్రకారం కేంద్రం అమలు జరుపడానికి ప్రయత్నిస్తున్న కొత్త పాలసీ మూలాన గోధుమ ధరలు ఈషణ్మాత్రమూ దిగిరాకపోగా అవి మార్కెట్లనుండిఅదృశ్యమైప్రజల్ని ఇంకా వేధిస్తున్నాయి:– స్వేచ్ఛా మార్కెట్లో గోధుమధరక్రిందటి సంవత్సరం కంటే బహుశంగా పెరిగింది:– ఉత్తరభారతంలోని గోధుమ ఉత్పత్తి రాష్ట్రాలలో మార్కెట్టుకు సరుకురాకపోగా సర్కారువారి ప్రొక్యూర్మెంటు విధానం కూడా ఎక్కడికక్కడ భగ్నమవుతున్నది:– ఈ పరిస్థితిచూసి కేంద్రప్రభుత్వంకలత చెందుతున్నదట:– పాపం అంత కంటే ఏంచేయగలదు:– ఆందోళనపడుతూ కూర్చోవడమొక్కటే ప్రభుత్వానికి తెలుసును:– భారీ భూస్వాములనుకానీమరానా వర్తకుల్నికానీ నిర్బంధించి సరుకు బయటకు లాగలేదు;– సరిగ్గా క్రిందటి సంవత్సరం ఈ రోజుల్లోనే రాష్ట్రపతి శ్రీ వి.వి. గిరి గారులక్నోలో చేసినఉపన్యాసం ఈ సందర్భంగా స్ఫురణకు వస్తున్నది:– అప్పట్లో ఉత్తర ప్రదేశ్ రాష్ట్రపతి పాలనలో ఉండేది:–అప్పుడూఇదేసమస్య:– భారీభూస్వామియైన ఒకకాంగ్రెస్ శాసన సభ్యుడు లెవీగోధుమల్ని ఇవ్వడానికి నిరాకరించిన ఉదంతం ఆయనకు తెలిసి ఆ వృత్తాంతాన్నిబహిరంగ సభలో పేర్కొని గిరిగారు తన విచారాన్నివ్యక్తం చేశారు:– నిర్దాక్షిణ్యంగాప్రొక్యూర్మెంటు చేయవలసిందని అధికారులను ఆదేశించారు:–ఫలితం శూన్యం:– సంవత్సరం గడిచింది:– పరిస్థితి ఎప్పటిలాగే ఉంది:– క్రిందటివారంలోఉత్తర ప్రదేశ్ ప్రభుత్వం అమాంతం లేచికూర్చునిబద్ధకాన్నివదలించుకొని ప్రొక్యూర్మెంటు కార్యక్రమాన్ని జోరుగా అమలుజరిపిందట:– ఒక్కవారం రోజుల పాటు కార్యక్రమం విజయవంతంగా సాగింది:–అంతే:– వర్తక వర్గాలవారందరూ సంఘటితమై ప్రభుత్వాన్ని ఎదిరించడానికి బిళ్ళకూచారు:– ఆ రాష్ట్రంలో ఆహారధాన్యాలవర్తకులసమాఖ్యకార్యదర్శి మొన్నటినుండి గోధుమ వ్యాపారాన్ని నిలుపుచేశారు:–లెవీ గోధుమల్ని ప్రభుత్వానికి ఇవ్వం గూడదని సంఘ సభ్యుల్ని ఆజ్ఞాపించారు:–ప్రభుత్వం బెదిరింపులకు లొంగరాదని ఒత్తిడిని ఎదుర్కోవాలని గట్టిగాచెప్పారు:– వాళ్లకేవో డిమాండ్లున్నాయి:– వాటిని తీర్చేవరకూవ్యాపారాన్ని స్తంభింపజేస్తారట:–ముఖ్యమంత్రి శ్రీ హేమవతీనందన్ బహుగుణ గారికి ఒక సన్మానం ఏర్పాటు చేసి చర్చలకు ఆహ్వానించారు:– బహుగుణగారు నిరాకరించి వర్తకులే తననివాసగృహానికి రావలసిందని కబురు పంపారు:–వర్తకులు వెళ్లలేదు:– ఫలితం ప్రతిష్టంభన:– ప్రజలకు గోధుమలు అలభ్యంగా ఉన్నాయి:– బహుగుణగారు ఎన్నికల్లో అఖండంగానెగ్గారుగాని, వర్తకుల్నినెగ్గలేకపోతున్నారు:–

దేశంలో గోధుమ వర్తకులు సక్రమ పథంలోనడిచి ప్రభుత్వంతోసహకరించడంలేదని ఢిల్లీ ప్రభుత్వ వర్గాలవారు విచారిస్తున్నారు:– వ్యవసాయదారులు తమ సరుకు విక్రయించకుండా వర్తకులే అటకాయిస్తున్నారట:– ఉభయులూ లాబూచీపడుతున్నారని కేంద్రం ఫిర్యాదు చేస్తున్నది:–

ఎవరితో ఫిర్యాదు చేస్తున్నదో భగవంతుడికే తెలియాలి:–నిస్సహాయులైన ప్రజలతో ఫిర్యాదు చేసి ప్రయోజనమేమిటి? వర్తకులు నీతి బాహ్యమార్గాలు అవలంబిస్తున్నారనివాపోవడంలోఅర్థమేమిటి?దమ్ములున్న ప్రభుత్వం అక్రమ నిల్వల్ని బయటికి తీసి నీతిబాహ్య వర్తకుల్ని కఠినంగా శిక్షించాలి:– లేకపోతే అధికారంలోకూర్చొనిఏంప్రయోజనం? సంపన్న భూస్వాముల,భారీవర్తకుల స్వైర విహారాన్ని అరికట్టలేని ప్రభుత్వ అసమర్థతను ఏమని వర్ణించాలి:– గోధుమ టోకుధర దేశంలో చిక్కడా క్వింటాల్ ఒక్కంటికి150రూపాయలు మించరాదని శ్రీ ఫకృద్దీన్ అలీఅహమద్‌గారుఈమధ్య నొక ఫర్మానా జారీ చేశారు:– వర్తకవర్గాలవారు దాన్ని తుడిచి అవతల పారేశారు.అవసరమైతే చట్టాన్నే సవరిస్తామని ప్రభుత్వం ప్రకటించింది:–

"అవసరమైతే", అనే హంస పాదునుగమనించాలి:– అవసరం వచ్చిందని ప్రభుత్వానికి ఎలా తెలుస్తుంది? ఎప్పుడు తెలిసిందీ, ఎప్పుడు తెలుస్తుంది?అయోమయ విధానాల్ని అనుసరిస్తూ పోయి ఎక్కడికక్కడ చతికిలపడుతున్న ప్రభుత్వం మళ్లీ అవే విధానాలకుమాసికలువేసిముందుకు సాగాలని ప్రయత్నిస్తున్నది:– ఘనంగా ధర నిర్ణయించిన అహమద్‌గారు దాన్ని అమలు పరచలేక పోతున్నారు:– అసమర్థ ప్రకటనలలో ఆయనఅద్వితీయుడు:–ఆయనకంటేఘనుడు ఆయన స్టేటు మంత్రి అన్నా సాహెబ్ షిండేగారు:– ఉభయులూ ఒకరికొకరు బాలా చక్కగా కుదిరారు:– ఒకరిని మించి ఒకరు ఆహార రంగాన్ని సంక్షోభంలో పడేస్తున్నారు:– ఉత్తర భారతమంతటా ప్రొక్యూర్మెంటు విధానం విఫలమైనది:– అక్రమ నిల్వలు యథేచ్ఛగా పెరుగుతున్నాయి:– అహమద్‌గారికీ షిండేగారికి ఆహార రంగంలో అసలు ఏంజరుగుతున్నదో అంతుచిక్కడంలేదు:– కేంద్ర ఆహారమంత్రిత్వశాఖలో వాళ్లిద్దరూచిరకాలంనుండిపాతుకుపోయి అన్ని విధాలా అలసిపోయారు:– వాళ్లకు ఆలోచనా శక్తి వట్టి పోయింది:– కేంద్రమంత్రిత్వశాఖ నిర్వహణనువాళ్లనుండి తప్పిస్తేగాని ఆహార రంగంలో సంక్షోభం నానాటికి ఎక్కువ కావడమే ఉంటుంది:– ఇప్పటికే సమయం మించిపోయింది:– కేంద్ర నాయకులు ఇకనైనా తమ నిర్లక్ష్యాన్నీ అలసభావాన్ని విడినాడి ఆహార సమస్యను సమర్థవంతంగా పరిష్కరించకపోతే వాళ్ల భవితవ్యమూ దేశ భవితవ్యమూ ఇరకాటంలో పడుతుంది:–

మహబూబ్‌నగర్ జిల్లాలో బస్సులు

అంచనాల సంఘానికి ప్రయాణికుల ఫిర్యాదు

(ఆంధ్రభూమి విలేకరి)

మహబూబ్‌నగర్, జూన్ 5

ప్రభుత్వరంగ సంస్థలస్థితిగతుల పరిశీలనకై విధానసభ నియమించిన అంచనాలసంఘం సభ్యులు ఈనెల 6వ తేదీన స్థానిక ఆర్.టి.సి. బస్‌స్టాండ్‌ను సందర్శించారు.

ఆర్.టి.సి. డిపో మేనేజర్ శ్రీ హరి నారాయణ్ భగత్ ఈ సభ్యులకు స్వాగతమిచ్చారు.

ఈ సభ్యులు ఇక్కడ ప్రయాణికుల తోనూ, ఆర్.టి.సి. సిబ్బంది తోనూ మాట్లాడి సమాచారం సేకరించారు.

ఇక్కడి ఆర్.టి.సి వారు ప్రయాణికులకు చేసిన సౌకర్యాలుకూడా సమర్థనీయం లేదనీ, బాగా రద్దీగల మార్గాలలో కూడా బస్సులు చాలా తక్కువగా ఉన్నాయనీ, ఈ బస్సుల పరిస్థితికూడా ఏమీ బాగాలేదనీ, బస్సులు ఓయముకు సతవరం లేదనీ పెక్కుమంది ప్రయాణికులు ఫిర్యాదు చేసారు.

ఆర్.టి.సి. సిబ్బందిసంఘం స్థానిక శాఖకార్యదర్శి శ్రీ రహ్మాన్‌సోఫీ తమకమిటీ సభ్యులకు సమర్పించిన మెమొరాండంలో ఇక్కడ ఆర్.టి.సి సిబ్బందికి వైద్య సౌకర్యాలు సమకూర్చాలనీ నివసించడానికి ఇళ్లు కట్టించి ఇవ్వాలనీ కోరారు.

ఖమ్మం రైతులకు గుర్తింపు కార్డులపై ఎరువుల పంపిణీ

ఖమ్మం, జూన్ 5 (పి.టి.ఐ)

ఖరీఫ్‌పంటకాలంలో రైతులకు రసాయనిక ఎరువుల సరఫరాకై యీనెల 25వ తేదీలోగా ఖమ్మంజిల్లాలో మూడున్నర లక్షల గుర్తింపు కార్డులను పంచిపెడతారు.

సోమవారంనాడు గ్రామాభివృద్ధి అధికారుల సమావేశంలో పసంగిస్తూ, ఇన్‌చార్జి జిల్లా కలెక్టర్ శ్రీ వి. కె. అగ్నిహోత్రి ఈవిషయం వెల్లడించారు.

వ్యవసాయశాఖ డిప్యూటీ డైరెక్టర్ శ్రీ శ్రీనివాసరావు మాట్లాడుతూ యీ కార్డుల తయారీకి, పంపిణీకి అవలంబించే పద్ధతిని వివరించారు.

సోషలిస్టు దేశాలలో ఆర్థిక సమానత

మాజీమంత్రి నర్సారెడ్డి వివరణ

నిర్మల్, జూన్ 5

సోవియట్ రష్యా బల్గేరియాలలో పర్యటించి తిరిగివచ్చిన మాజీమంత్రి శ్రీ పి. నరసారెడ్డి సోమవారంనాడు ఇక్కడి ఒక సభలో సోషలిస్టుదేశాలలో జీవన పరిస్థితులనుగురించి విపులంగా చెప్పారు.

రెండవ ప్రపంచయుద్ధంలో బాగా దెబ్బతిన్న బల్గేరియా సోషలిస్టు వ్యవస్థను నెలకొల్పుకొని స్వల్పకాలంలో గొప్ప అభివృద్ధిని సాధించిందనీ, పౌరుల తలసరి ఆదాయం జాతీయ ఆదాయం పెరిగిందనీ ప్రజల జీవన పరిస్థితులు బాగా అభివృద్ధి చెందాయనీ శ్రీ నరసారెడ్డి చెప్పారు.

ఉమ్మడి వ్యవసాయం,వ్యవసాయోత్పత్తులపై ఆధారపడిన పరిశ్రమల స్థాపన, ప్రభుత్వమేపరిశ్రమలనునిర్వహించడం,అత్యాధునికమైనపద్ధతులలో పరిశ్రమలను నిర్వహించడం మొదలగు మార్గాలను అవలంబించి ఈ అభివృద్ధి సాధించారు. అక్కడ ఉన్న సోషలిస్టు వ్యవస్థలో వ్యక్తులకు వారి సామర్థ్యాన్నిబట్టి, వారి అవసరాలనుబట్టికనీ స అవసరాలన్ని తీరుతున్నాయి. బల్గేరియాలో ప్రైవేటు ఆస్తి లేదు. నిరుద్యోగం లేదు. ఆహార ధాన్యాల కొరత అసలే లేదు. జాతీయ సంపదను న్యాయంగా సమానంగా అందరికీ పంచడమే ఈ వ్యవస్థ విశిష్టత.

బల్గేరియాలో మత సంబంధమైన స్వేచ్ఛ సంపూర్ణంగా ఉన్నది. ప్రభుత్వం ఎట్టి విధంగా జోక్యం చేసుకోదు. మత మనేది అక్కడ వ్యక్తుల స్వంత వ్యవహారం.

బల్గేరియాలో పౌరులలో గొప్ప సోదరభావం, దేశభక్తి ఉన్నాయి. దేశంలో ఎవరిని అడిగినా తనకోసమే జాతి అంతా శ్రమిస్తున్నదనీ, తాను జాతికోసం శ్రమిస్తున్నాననీ మనస్ఫూర్తిగా చెబుతారు. శ్రమకు ఆదేశంలో చాలా విలువ ఉంది గౌరవ ప్రతిష్టలున్నాయి.

రష్యాలో ప్రత్యేక హక్కులు, సదుపాయాలు గలిగినట్టి వర్గమేదయినా ఉన్నదా? అని కొసగిన్‌ను అడిగితే "ఉన్నది. వృద్ధులు బాలలే మా దేశంలో ఈ వర్గం" అని ఆయన సమాధానమిచ్చారని శ్రీ నర్సారెడ్డి చెప్పారు.

యువజన సమాఖ్య ఆధ్వర్యాన జరిగిన ఈ సభకు శ్రీ దాసోదరరావు అధ్యక్షత వహించారు.

యువజన సమాఖ్య అధ్యక్షుడు శ్రీ హనుమంతరెడ్డి వివరణ వందన సమర్పణ చేసారు.

నవతఆర్ట్స్‌ఆధ్వర్యంలో కందుకూరి వర్ధంతి

హైదరాబాద్, జూన్ 5

నగరంలోని హెచ్.ఎ.ఎల్. సిబ్బంది సాంస్కృతిక సంఘం "నవత ఆర్ట్స్" ఆధ్వర్యంలో హెచ్. ఎ. ఎల్. ఆడిటోరియంలో ఈ నెల 2న నవయుగ వైతాళికుడు, సంఘ సంస్కర్త కందుకూరి వీరేశలింగం పంతులు 165వ వర్ధంతి ఉత్సవం జరిగింది.

ఆంధ్రభూమి ఎడిటర్ శ్రీ గోరాశాస్త్రి సభకు అధ్యక్షత వహించారు. శ్రీ వీరేశలింగం పంతులుగారు సంఘంలోని దురాచారాలను రూపుమాపే ప్రయత్నంలోఅన్ని విధాల వ్యతిరేకతను ఎదుర్కొంటూ కార్యదీక్షతో ముందుకు సాగి ప్రజలకు ఎనలేని సేవచేశారని ఆయన అన్నారు.

శ్రీ త్రిపురనేని రమేశ్ ప్రభృతులు ప్రసంగించారు.

బీహార్ ఆందోళన

(1వ పేజీ తరువాయి)

పన పత్రం ఊరేగింపు ముందు నడచిన ట్రక్కులో ఉంటారు.

ఎండ వేడిమిని లెక్కించకుండా ఈ ఊరేగింపులో యువజనులు విద్యార్థులు వివిధ పార్టీల నాయకులు శాసన సభ్యులు వివిధ వర్గాల ప్రజలు పాల్గొన్నారు. శాంతియుతంగా ఊరేగింపు రాజభవనంవరకు వెళ్లనది. జయప్రకాశ్ నాయకత్వంలో ఒక ప్రతినిధివర్గం గవర్నర్‌కు మహా విజ్ఞాపన పత్రాన్ని అందచేసింది. జయప్రకాశ్ ఖందాబాద్, ప్రజలను లూటీ చేయడానికి, కాల్పులు జరుపడానికి ఎవరికీ హక్కులేదని, విధానసభ రద్దుద్వారా కొత్త వ్యవస్థను నిర్మించాలని ప్రదర్శకులు నినాదాలు చేశారు; మంత్రివర్గంరాజీనామా ఇవ్వాలని కోరారు.

ఊరేగింపుపై కాల్పులు

రాజభవనంనుండి ఊరేగింపు తిరిగి వెళ్లతుండగా వెనుకభాగంనుండి ఇందిరా బ్రిగేడ్‌వారని చెప్పుకొనే కొందరు ఒక భవనంనుండి కాల్పులు జరిపారు; ఈ కాల్పులవల్ల దాదాపు డజనుమంది గాయపడినారు. ఇందిరా బ్రిగేడ్ కార్యకర్తలు 17 మందిని పోలీసులు ఈ సందర్భంగా అరెస్టు చేసారు. మూడు రబుల్ బ్యారల్ తుపాకులు, ఐదు పిస్తోళ్లు, 49 తూటాలు, ఒక బాకు ఆ భవనంలో పట్టుబడినవి. ఆ భవనం కాంగ్రెస్ శాసన సభ్యుడు పులేకరాయ్ పేరకలదు. ఈ కాల్పుల వల్ల గాయపడినవారికి ఆస్పత్రిలో చికిత్స జరిగినది. బీహార్ ప్రభుత్వం గాయపడిన వారికి రెండు వందల రూపాయల ఆర్థిక సహాయాన్ని మంజూరు చేసింది.

బీహార్ ముఖ్యమంత్రి ఖండన

విద్యార్థుల ఉద్యమానికి జయప్రకాశ్ నాయకత్వం వహిస్తున్నందున ఆయనను బీహార్ ప్రభుత్వం అరెస్టు చేయగలదని ప్రచారమైనవార్తను ముఖ్యమంత్రి అబ్దుల్ గఫూర్ ఖండించారు. ప్రభుత్వానికి అట్టి ఉద్దేశమే లేదని, జయప్రకాశ్ ఆరోగ్యం పట్ల తమకు అధిక ఆదుర్దాకలదని ఆయన తెలిపారు.

విధానాలుమార్చుకొంటే పోర్చుగల్‌తో సంబంధాలు

నూతన ప్రభుత్వంపట్ల వైఖరిపై ఢిల్లీ ప్రతినిధి వివరణ

న్యూఢిల్లీ, జూన్ 5 (పి.టి.ఐ)

గోవావిషయంలోను, ఆఫ్రికాలోను దమనపూర్వకమైన విధానాల విషయంలోనూ పోర్చుగల్‌లో నూతనంగా ఏర్పడిన ప్రభుత్వం పూర్వవైఖరిని మార్చుకునే సూచనలేమైనా కన్పిస్తే ఆ దేశంతో ఇండియా తమసంబంధాలపై పునరాలోచన జరుపగలదని ఢిల్లీలో ప్రభుత్వ ప్రతినిధి వ్యాఖ్యానించారు.

సంబంధాల పునరుద్ధరణ గురించి ప్రధాని శ్రీమతి ఇందిరాగాంధీ సెనెగల్ అధ్యక్షునిద్వారా వర్తమానం పంపారంటూ విదేశాంగమంత్రి మెరిమోసోరెస్ చేసిన ప్రకటనపై ఢిల్లీనుండి ఈ వ్యాఖ్యానం వెలువడింది.

ప్రధాని వర్తమానం పంపినదీ లేనిదీ ధ్రువపడలేదు.

ఎరువుల ధర హెచ్చింపువల్ల పంటలు దెబ్బతినే ప్రమాదం

రైతుసంఘం అధ్యక్షుడు వై.వి.కృష్ణారావు విమర్శ

(ఆంధ్రభూమి విలేకరి)

హైదరాబాద్, జూన్ 5

ఎరువులధర పెంచినందువల్ల రైతులపై భారంపెరిగిందనిదీని ఫలితంగా అక్టోబర్‌లో వచ్చే పంట దెబ్బతినే ప్రమాదం ఉన్నదని రాష్ట్ర రైతు సంఘం అధ్యక్షుడు విధాన పరిషత్ సభ్యుడు శ్రీ వై. వి. కృష్ణారావు అన్నారు.

ఎరువులధర ఇదివరకే చాలా ఎక్కువగా ఉంది. ఇప్పుడు దాన్ని రెట్టింపుచేసారు.

లోటు బడ్జెట్ విధానాన్ని ఉపసంహరించేందుకు గైకొంటున్న చర్యలలో భాగంగా ఎరువుల ధర పెంచినట్టు ప్రభుత్వం చేస్తున్నవాదన వింతగాఉంది.

ఎరువుల ధర పెరిగితే వ్యవసాయ ఖర్చులు పెరుగుతాయి. ఉత్పత్తుల ధర కూడా దీని ప్రకారం పెరుగుతుంది. ఈ విధంగా ఆహారధాన్యాల ధరలు చుక్కలంతగా పెరుగుతాయి.

రాష్ట్రంలో ఎరువుల బాక్‌మార్కెట్ విపరీతంగా పెరిగిపోతున్నదని శ్రీ వై. వి. కృష్ణారావు ఈ ప్రకటనలో అన్నారు. ఈ బ్లాక్‌మార్కెట్‌ను అరికట్టడానికి, దేశానికి అవసరమైన ఎరువులను దేశంలోనే ఉత్పత్తి చేయడానికి చర్యలు గైకొనాలని కేంద్ర ప్రభుత్వానికి ఆయన విజ్ఞప్తి చేసారు.

పొగాకులోనిపొలోనియంవల్ల ఊపిరితిత్తుల కేన్సర్ వ్యాధి

అమెరికన్ శాస్త్రజ్ఞుడు డాకర్ ఎడ్వర్డ్ మార్టెర్ వివరణ

న్యూఢిల్లీ, జూన్ 5 (పిటిఐ)

పొగత్రాగడంవల్ల ఊపిరితిత్తులకు కేన్సర్‌వ్యాధి ఎలా వస్తుందో ఎంతో ప్రయత్నంమీద కనుగొన్నట్టు అమెరికా శాస్త్రజ్ఞుడు డాక్టర్ ఎడ్వర్డ్ మార్టెర్ ప్రకటించారు.

సిగరెట్ల పొగలో సూక్ష్మమైన ధార్మిక శక్తిగల కణాలు ఉండడంవల్ల ఈ ఊపిరితిత్తుల కేన్సర్ ఏర్పడుతుందని ఆయన చెప్పారు.

ధార్మికశక్తిగల కణాలు పొగత్రాగే వారి ఊపిరితిత్తులలో నిలువఉండి ప్రమాదకరమయిన "ఆల్ఫా"కిరణాలను విడుదల చేస్తాయని "నేచర్"అనే పేరుగల బ్రిటిష్ సైన్స్ మేగజైన్‌లో ఆయన వ్రాశారు.

ఊపిరితిత్తుల కేన్సర్‌కు కారణమయిన ఆల్ఫా కిరణాలను ఉత్పత్తిచేసి "పొలోనియం"అనే పదార్థం పొగాకులోనూ:సిగిరెట్లలోనూ, పొగత్రాగేవారి ఊపిరితిత్తులలోనూ కానవస్తుందని ఆయన చెప్పారు.

పొగాకులోనూ, సిగిరెట్ పొగలోనూ, పొగత్రాగేవారి ఊపిరితిత్తులలోనూ సీసం తాలూకు ధార్మికశక్తిగల ఐసోటోపులుంటాయనీ, మామూలుగా గృహాలలో ఉపయోగించుకొనే సీసంకాక అందు కు భిన్నమయిన మరోరకపు సీసపు ఆల్ఫా కిరణాలను ఉత్పత్తిచేసే పొలోనియంగా మారుతుందనీ, ఈ సీసం రక్తంలో కరగకుండా ఉండిపోవడంవల్ల కొన్ని ఏళ్లపాటు ఊపిరితిత్తులలోనే ఉండిపోతుందనీ, ఈ కారణంగానే పొగత్రాగడానికీ, ఊపిరితిత్తుల కేన్సర్ రావడానికి మధ్య చాలా ఆలస్యం అవుతుందనీ ఆయన అన్నారు.

అయితే పొగాకుపై ధార్మికశక్తిగల కణాలు ఎలా ఏర్పడతాయిఅని ప్రశ్నిస్తే అందుకు ఆయన జవాబిస్తూ పొగాకు ఆకులపై వేలాదిగా సన్నని వెంట్రుకలాంటివి ఉంటూ చేతికి గుచ్చుకొనేట్లుగా ఉంటాయనీ, అవి గాలిలోని ధార్మికశక్తిగల కణాలను వోగుచేస్తాయనీ అన్నారు.

సుప్రీంకోరు నిర్ణయం

(1వ పేజీ తరువాయి)

వలసినదిగా కోరుతున్నారనే చర్చలోకి కూడా కోర్టు వెళ్ళడానికి వీలులేదు.

తిరుగులేని అభిప్రాయం

ఈ కేసులో సుప్రీంకోర్టు చెప్పిన అభిప్రాయం సలహా పూర్వకమైనదే, ఇది తీర్పుకాదు. అయినప్పటికీ ఆచరణలో ఇది తిరుగులేనిది. దేశంలోనిఅన్నికోర్టులు ఈ అభిప్రాయాన్ని విధిగా పాటించవలసి ఉంటుందని న్యాయవేత్తలు భావిస్తున్నారు. ఈ అభిప్రాయాన్ని మార్చాలంటే మళ్ళీ సుప్రీంకోర్టుదే మరోబెంచి, ఇప్పటిదాని కన్న విస్తృతమైన బెంచి ద్వారా జరగవలసిందే. రాజ్యాంగంలోని 141వ ఆర్టికల్ సుప్రీంకోర్టు శాసనం దేశంలోనికోర్టులన్నీ విధిగా పాటించాలని నిర్దేశిస్తున్నది. రాజ్యాంగంలోని వివిధ ఆర్టికల్స్ యొక్క భావాన్ని విశదీకరిస్తూ సుప్రీం కోర్టు చెప్పిన అభిప్రాయాన్ని దాని శాసనంగా పరిగణించవలసి ఉంటుంది.

ఈ కేసులో అటార్నీ జనరల్, ఎన్నికల కమిషన్, అరడజను రాష్ట్ర ప్రభుత్వాలు, నాలుగు ప్రతిపక్ష పార్టీలు కోర్టు ముందు తమ అభిప్రాయాలను తెలుపుకున్నవి. కోర్టు ఐదురోజులు వీరి వాదోపవాదాలను విన్నది.

లోక్‌సభ స్పీకర్, రాజ్యసభ చైర్మన్‌కు కూడా కోర్టు నోటీసులు పంపినది కాని వారు వాదోపవాదాలలో పాల్గొనడానికి అంగీకరించలేదు.

ఈ కేసును నివారించిన న్యాయమూర్తులు పేర్లు ప్రధాన న్యాయమూర్తి శ్రీ ఎ. ఎన్. రే, శ్రీ జగన్మోహన్‌రెడ్డి, శ్రీ డి. జి. పాలేకర్, శ్రీ హెచ్. ఆర్. ఖన్నా, శ్రీ ఎం.ఎం. మాథ్యూ, శ్రీ ఎమ్. హెచ్. బేగ్, శ్రీ వై. వి. చంద్రచూడ్.

గోఖలే అభిప్రాయానికి సమర్థన

ఈ విషయంలో పై ఏప్రిల్‌లో పార్లమెంట్‌లో ఒక ప్రకటన చేస్తూ న్యాయశాఖ మంత్రి శ్రీ హెచ్. ఆర్. గోఖలే ప్రభుత్వానికి యీ విషయంలో సందేహం ఏమీలేదని ఎన్నిక జరిగేనాటికి పార్లమెంట్ ఉభయ సభలలోను, అస్తిత్వంలో ఉన్న అసెంబ్లీలలోను ఉన్న ఎన్నికైన సభ్యులే "నియోజకవర్గం"గా పరిశీలింపబడతారని తమ అభిప్రాయమని ఆయన అన్నారు. అయితే పార్లమెంట్‌లో బయటా కూడా కొందరు వ్యక్తులు ఇందుకు భిన్నమైన అభిప్రాయాన్ని ప్రకటించినందున కోర్టు అభిప్రాయాన్ని కోరుతున్నామని ఆయన అన్నారు.

మనరాజ్యాంగం అమలులోకి వచ్చిన తర్వాత 148(1) ఆర్టికల్ ననుసరించి సుప్రీమ్‌కోర్టును ఒక విషయంపై ఈ విధంగా అభిప్రాయం కోరడం ఇది అరవసారి.

ఢిల్లీ శాసనాల చటంపైన, కేరళ విద్యా బిల్లుపైన ఉత్తరప్రదేశ్ అసెంబ్లీ హక్కులపైన, బెరుబారిఐలీ కేసుపైన, సముద్ర సుంకాల చట్టంపైన ఇదివరకు కోర్టును అభిప్రాయం కోరారు.

1961 సంవత్సరపు రాజ్యాంగం 11వ సవరణ చట్టం చెల్లదన్న సోషలిస్టు పార్టీ వాదంపై కోర్టు అభిప్రాయం చెప్పలేదు. ఈ కేసులో దాని చర్చకు ఆస్కారం లేదని ప్రకటించినది.

మధ్య ప్రాచ్య సమస్య పరిష్కార అవకాశాలు

సమితి ప్రధాన కార్యదర్శి వాల్డేమ్ అభిప్రాయం

డమస్కస్ జూన్ 5 (రాయిటర్)

పూర్వంకన్నా ఇప్పుడు మధ్య ప్రాచ్యంలో పరిష్కారానికి అవకాశాలు మెరుగయినాయని సిరియా ఇజ్రాయెల్‌ల మధ్య పోరాట విరమణకు అంగీకారం కుదిరినదని సమితి ప్రధాన కార్యదర్శి కుర్ట్‌వాల్డేమ్ నిన్న పేర్కొన్నారు.

మధ్యప్రాచ్య పర్యటనలో ఉన్న వాల్డేమ్ బీరుట్‌నుండి ఇక్కడికి వచ్చారు.

వాల్డేమ్ గోలాన్‌గుట్టలరంగాన్ని సందర్శించిన తర్వాత సిరియా అధ్యక్షులు హఫీజ్ అల్ అసద్‌తో సమావేశమవుతారు. మధ్యప్రాచ్య సమస్యకు సమగ్ర పరిష్కారాన్ని సాధించడానికి ఓరిమి అవసరమని జెనీవా శాంతి చర్చలు త్వరలో ప్రారంభమయే అవకాశంలేదని ఆయన తెలిపారు.

బొంబాయి వద్ద 1200 చదరపు కిలోమీటర్ల ప్రాంతంలో చమురు లభించే అవకాశం

పానాజీ, జూన్ 5 (పి.టి.ఐ)

బొంబాయి తీర జలాలలో చమురు లభించే అవకాశాలు చాలా బాగా ఉన్నాయని, పెట్రోలియం రసాయనాల మంత్రి షా నవాజ్ ఖాన్ అన్నారు.

సుమారు 12 వందల చదరపు కిలోమీటర్ల ప్రాంతంలో చమురు ఉన్నట్టు తేలుతున్నదని మొదటి బావి త్రవ్వకం చమురు పరీక్షలు విజయవంతంగా పూర్తయ్యాయని ఆయన చెప్పారు.

గోవాలో ఒక రోజు పర్యటనానంతరం విలేకరులతో మాట్లాడుతూ దేశంలో నానాటికీ పెరుగుతున్న చమురు వాడకం చమురు ఉత్పత్తి చేస్తున్న దేశాలు విపరీతంగా ధరలు పెంచడం దృష్ట్యా మనం కష్టపడి చమురు ఉత్పత్తి పెంచుకోవాలని ఆయన అన్నారు. వర్జిన్ ఆయిల్ దిగుమతుల వ్యయం 2 వందల కోట్ల నుండి 18వందల కోట్లకు పెరిగినదని మంత్రి చెప్పారు.

ఐదవ ప్రణాళిక కాలంలో 15 కొత్త ఎరువుల ఫ్యాక్టరీలు ఉత్పత్తి ప్రారంభించగలవని ఆయన చెప్పారు.

చమురు అన్వేషణ, ఉత్పత్తి విషయంలో ఇరాన్‌తో దీర్ఘకాలిక ఒప్పందం కుదుర్చుకునే అవకాశాలు ఉన్నాయని మంత్రి వెల్లడించారు.

బీహార్ అసెంబ్లీ సమావేశం

(1వ పేజీ తరువాయి)

కాంగ్రెస్ నాయకుడు శ్రీ హరిహర్ ప్రసాద్ సింగ్ కూడా నేటి సమావేశానికిరాలేదు.

శ్రీ శాస్త్రితో సహా ఏడుగురు ఎస్.ఎస్.పి సభ్యులు, 12 మంది జనసంఘ సభ్యులు తమ విధానసభ సభ్యత్వాలకు ఇంతవరకూ రాజీనామాలు సమర్పించారు.

రాజీనామా సమర్పించిన వారెవరూసమావేశానికి రాలేదు.

ఎస్.ఎస్.పి, ప్రతిపక్ష కాంగ్రెస్ సోషలిస్టు పార్టీల సభ్యులు పలువురు సమావేశానికి వచ్చారు. కమ్యూనిస్టు సభ్యులందరూ సమావేశానికి వచ్చారు.

రాజీనామా చేయని తమ పార్టీ శాసన సభ్యులపై క్రమశిక్షణ చర్య గైకొంటామని జనసంఘం నేడు ప్రకటించింది.

నేడు విధానసభ సమావేశమయ్యేసరికి అక్కడికి వచ్చే రోడ్లన్నిటిపై పోలీసులు, సి.ఆర్.పి. పెద్దసంఖ్యలో కాపలాఉన్నారు.

జనవాక్యం

నీటి సరఫరా లేని సైదాబాద్

అయ్యా!

సైదాబాదు ప్రాంతానికి నీటి సరఫరా రోజురోజుకు పూర్తిగాదిగజారిపోతున్నది. గత కొద్ది రోజులుగా అసలు నీళ్ళే రావడం లేదు. మామూలు పైపులనుండి రానందువల్ల గుంతలు చేసుకొని నీటి కోసం ప్రయత్నించినా ఫలితం ఉండడంలేదు. నీళ్ళు రాకపోవడానికి కారణాలేమిటో ఎందుకు ప్రెషర్ తగ్గిపోతున్నదో వాటర్ వర్క్స్ శాఖ పరిశీలించడంలేదు. కనీసం ఒక్కపూట ఉదయమైనా, సాయంత్రమైనా నీరు సరఫరా అయ్యేట్లుచూడాలి. దంచల్‌గూడా పంపింగ్ స్టేషన్‌నుండిసరూర్‌నగర్ దాకా నీరు సరఫరా చేస్తున్నారు. కొంత పరిమిత ప్రాంతానికి సరఫరాకునిర్మించినపంపింగ్ స్టేషన్ అనేక కొత్త కాలనీలకు కొన్ని వేల ఇళ్ళకు నీరు ఎట్లా సరఫరా చేయగలుగుతుందో అర్థంకావడంలేదు. వాటర్ వర్క్స్‌శాఖ ఇంజనీర్లు నగరంలోని అనేక బస్తీలు నీటి అవసరాల విషయంలో పూర్తి నిర్లక్ష్యంతో వ్యవహరిస్తున్నారు. కాబట్టి ఆ

ప్రపంచ జనాభాలో 40 కోట్ల మంది క్షుద్బాధితులు

జెనీవా, జూన్ 5 (యు. పి. ఐ)

ప్రపంచ జనాభాలో 40 కోట్ల మందికి కనీస పోషణకు కనీసం అవసరమైనంత పరిమాణంలో ఆహారం లభించడం లేదని ఆహార సమస్యల ప్రపంచ మహాసభ డైరెక్టర్ పేర్కొన్నారు.

పోషకాహార సూత్రాల దృష్ట్యా చెప్పాలంటే క్షుద్బాధాపీడితుల సంఖ్య 80 కోట్ల దాకా ఉంటుందని డైరెక్టర్ సమ్మద్ అహమద్ మాలే (ఈజిప్టు) వివరించారు.

వర్తమాన దేశాల జనాభాలో 20 శాతం అన్నార్తులని ఆయన అన్నారు.

అట్టి క్షుద్బాధితులు ప్రపంచ జనాభాలో ఆఫ్రికాలో 25 శాతం, దూర ప్రాచ్యంలో 22 శాతం, సమీప ప్రాచ్యంలో 20శాతం, దక్షిణ అమెరికాలో 13 శాతం ఉన్నట్టు అయన పేర్కొన్నారు.

ఉత్తర ఐర్లెండ్‌పై పాలన కొనసాగింపునకు బ్రిటిష్ ప్రభుత్వ నిర్ణయం

లండన్, జూన్ 5 (ఎ. ఎఫ్. పి)

ఉత్తర ఐర్లెండ్‌పై బ్రిటిష్‌పాలన కొనసాగించాలని బ్రిటిష్ ప్రభుత్వం నిర్ణయించినది. బ్రిటిష్ ప్రభుత్వం తలపెట్టిన రాజకీయ పరిష్కారాన్ని ఐర్లెండ్ ప్రజలు అంగీకరించకపోయినా తమ పరిపాలనాధికారాన్ని విడనాడబోమని ప్రభుత్వం ప్రకటించింది.

వ్యవసాయదారులారా త్వరపడండి!

అముదము విత్తనాలు 157-బి

100% స్వచ్ఛమైనవి మరియు శీఘ్రంగా మొలకెత్తగలవు

సంప్రదించండి:

రమేష్ పారిఖ్

శేర్ పార్కో అండ్ కంపెనీ

62, మహాత్మాగాంధి రోడ్

సికింద్రాబాదు

టెలిఫోను: రెసిడెన్సీ: 74066

ఆఫీసు: 75870

(ఆర్ 5420)

ప్రకటన

Dic. No. SK 37/74

శ్రీ రాజరాజేశ్వర సంస్కృత కళాశాల వేములవాడ

ఈ క్రింద సదహరించిన ఉద్యోగములకు దరఖాస్తులు కోరబడుచున్నవి.

ఉద్యోగము:- L.D.C. cum Typist

అర్హతలు:- PUC or Intermediate and Higher Grade English Typewriting Exam.

వేతనము:- స్కేల్ (92-196) 92-196 plus D.A. as usual—

వయస్సు:- 30 సం.లకు మించకుండా ఉండవలెను.

ఈ ఉద్యోగమునకు అభ్యర్థులు తమ వినతి పత్రములను శ్రీయుత 'ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ శ్రీ రాజరాజేశ్వరస్వామి దేవాలయము వేములవాడ కరీంనగర్ జిల్లా గారి పేర తేదీ 12 6 74లోగా పంపవలయును అభ్యర్థులు తేదీ 16 6.1974నాడు 3.00 గంటలకు జరుగు ఇంటర్‌వ్యూకు తమ స్వంత ఖర్చులతో హాజరు ఉండవలయును.

N.B: ప్రత్యేక అర్హతలు:- తెలుగు Typewriting లో ప్రావీణ్యత బోధనా అనుభవము, Dip. O.L. లేక సంస్కృత భాష పరిచయముగలవారికి ప్రత్యేకతఇవ్వబడును.

శ్రీ కె. రంగయ్య B.Sc., LL.B.

కార్యదర్శి శ్రీ రాజరాజేశ్వర సంస్కృత కళాశాల మరియు ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ శ్రీరాజరాజేశ్వర స్వామి దేవాలయము. వేములవాడ.

మానసిక శాంతికోసం ధర్మ మార్గానుసరణ

సచ్చిదానందస్వామి అభిభాషణ

హైదరాబాద్, జూన్ 5

మైసూర్ శ్రీ గణపతి సచ్చిదానంద స్వామి నిన్న ఇక్కడ కౌతా రామకోటి కళ్యాణ నిలయంలో మానసిక ప్రశాంతత కోరుతున్న అనేక భక్తులకు చిత్త ప్రసన్నత చేకూర్చడంకోసం శ్రీ కృష్ణ పరంధాముని గురించి హరికథాగానం చేశారు. పూర్వాశ్రమంలో స్వామివారి పెద నాన్న శ్రీ శేషప్ప హరిదాసుగారు ఈ హరికథను రచించారు. శ్రీకృష్ణ కథాగానం ద్వారా స్వామి అందరికి అర్థమయ్యేరీతిలో బోధిస్తూ నేటి భౌతికయుగంలో శాంతి నెలకొనాలంటే ధర్మవిరుద్ధమైన చట్టాలకు ప్రవర్తనలకు స్వస్తి చెప్పాలని సదాలోచనపరులు, మార్గదర్శకులైనవారు మానవజాతి శ్రేయస్సుకోసం ఒక అనుశాసన నిబంధనావళిని రూపొందించాలని సూచించారు.

మానవునికి సమస్య జరా, రుజ, మరణ క్లేశాలకు లోనయే దేహమేనని, ఎన్ని ఉన్నా దేహం అవసరాలు అనంతంగా పెరుగుతుంటాయని ఆత్మలేక చైతన్యం అనేశవంపోయిన తర్వాత మిగిలేది శవమే నపేది ఎప్పటికప్పుడు మరచిపోయానే ఉంటారని స్వామి అన్నారు. అర్థం.కామం ధర్మ మార్గంలో సాధించినప్పుడు అదే మోక్షసాధనకు మార్గం కాగలదని ఆయన అన్నారు.

మానవజన్మ లభించడం, అందులో భగవచ్చింతన అబ్బడం, గురుసాన్నిధ్యం దొరకడం ఈ మూడూ సమకూరడంబాలా అరుదని తండ్రి భౌతికదేహాన్ని ప్రసాదిస్తే గురువు ధివ్యజీవనాన్ని ప్రసాదిస్తారని, సంసార సాగరాన్ని తరింపజేస్తారని ఒక లోహాన్ని మరో లోహంగా మార్చినట్టు పూర్తిగా మార్చివేస్తారని స్వామి అన్నారు

గురువు, భగవంతుడు, ధర్మ పథం గురించి గాఢంగా పరితపించేవారికి తప్ప అందరికీ అనుభూతి అవగాహన ఏర్పడదని భగవంతుని చూపించేది గురువుకాబట్టి గురువు రక్షణ పొందాలని శాంతి సాధనకు గురువును అనుసరించి వారి బోధనను అనుష్ఠానంలోకి తెచ్చుకోవాలని శ్రీ గణపతి సచ్చిదానందస్వామి అన్నారు. సద్గురువు, ఓంకార స్వరూపుడు, సర్వాంతర్యామి, సర్వశక్తిమంతుడు, ప్రత్యక్ష భగవంతుడు కనుక అట్టి సద్గురువునే ఆశ్రయించాలని స్వామి ఉద్బోధించారు.

విద్యాబోధన ధర్మక్షేత్రికి భారతీసేదిగా ఉండరాదనికూడా స్వామి అన్నారు. దుర్గుణాలను మొగ్గలోనే తుంచి ఆత్మార్థిక శిక్షణ గరపాలన్నారు. శ్రీ గణపతి సచ్చిదానందస్వామి రేపు ఉదయం 11 గంటలకు బయల్దేరి అనంతపురం జిల్లాలోని బొమ్మపర్తి గ్రామంలో "గురుమాత" సమాధిపై పుష్పాంజలి ఘటించి అక్కడి నుండి మైసూర్ నగరంలోని తమ ఆశ్రమానికి చేరుకుంటారు.

ఆయన ఇక్కడ స్కంధగిరి సుబ్రహ్మణ్య, వేంకటేశ్వరాలయాలను, శ్రీసత్యనారాయణస్వామి ఆలయాన్ని సందర్శించారు. గత ఆదివారంనాడు గణపతి హోమంచేసి 25 మంది వేదపండితులను సత్కరించారు. జంటనగరాల జ్ఞానబోధ సభకు శ్రీ కౌతా లక్ష్మీమనోహర్‌ను అధ్యక్షులుగా నియమించారు.

ఆర్.టి.సి.లో "ఎ" గ్రేడ్ అప్రెంటిస్‌ల ఎంపిక

హైదరాబాద్, జూన్ 5

రాష్ట్ర ఆర్.టి.సి. కార్పొరేషన్‌లో "ఎ" గ్రేడ్ అప్రెంటిస్‌లుగా నియమించదానికై క్రింది 29 మందిని పరీక్షలో వారు చూపిన ప్రతిభకు అనుగుణంగా క్రింది క్రమంలో ఎంపిక చేశారు.

అభ్యర్థుల పేర్ల ప్రక్కన బ్రాకెట్లలో ఉన్నవి రోల్ నంబర్లు.

శ్రీయుతులు డి.చెంగల్‌రాయుడు (3865) ఎస్. భాస్కరరావు (238), ఎ. కృష్ణారావు (176), వి. వి సుబ్బారావు (168), పి. వెంకటరామారావు (354), కె. నరసయ్య (126), సాయి రాంబాబు (360), ఆర్. గురవయ్య (258), ఎస్ శ్రీరామమూర్తి (260), ఫి. సూర్యనారాయణ (119), ఎ. శ్రీనివాసగోపాల్ (302), డి. సుధాకరరావు (154), యు. జానకిరామ్ (150), సయ్యద్‌హమీదుల్లా (278), పి. శ్రీరాములు (270), ఎమ్. వెంకటరెడ్డి (134), కె. వి. ఎన్. శర్మ (320), ఎమ్. రామలింగేశ్వరరావు (208), బి. సుబ్బన్న (293), కె. వెంకటాచార్యులు (354), జి కృష్ణమూర్తి (168), ఎ. నారాయణ (207), సయ్యద్ వయాజర్ రహమాన్ (308), టి. వి. చంద్రశేఖర్ (312), టి రాజారామ్ (276), మసూద్ అహమ్మద్ ఖాదరి (274), ఎమ్. సత్యనారాయణ (266), పి. రామకృష్ణ (157) డి. విశారదరావు (284).

70 హత్యలు చేశాడనే అనుమానంపై శంకరయ్య అరెస్టు

జైపూర్, జూన్ 5 (పి.టి.ఐ)

గత రెండు సంవత్సరాల కాలంలో పంజాబ్, హర్యానా, రాజస్థాన్‌లో 70 మందిని హత్య చేశాడనే అనుమానంపై శంకరయ్య అనేవ్యక్తిని రాజస్థాన్ పోలీసులు నిన్న అరెస్టుచేశారు.

రతన్‌లాల్ అనే హంతకుడితో రిక్షా డ్రైవర్‌గా ఉంటున్న శంకరయ్యను పంజాబ్‌లోని భాటిండాలో అరెస్టు చేశారు. "సుత్తెతో తల పగులగొట్టి చంపడం ఈ హత్యలన్నిటిలో సామాన్య లక్షణం.

జైపూర్ నుండివెళ్ళిన సి.ఐ.డి. ప్రత్యేక బృందం అందజేసిన సమాచారాన్ని పురస్కరించుకొని గంగానగర్ పోలీసులు శంకరయ్యను అరెస్టు చేశారు.

జైపూర్, బికనీర్‌లకు చెందిన సి. ఐ. డి. అధికారులు గంగానగర్‌లో ధర్నాపై జరుపుతున్నారు.

గంగానగర్ పోలీసు స్టేషన్‌కు నిర్బంధితుని తీసుకురాగా అతడిని చూడడానికి వేలాది ప్రజలు వచ్చారు.

గంగానగర్ జిల్లాలోనే 40 మంది దారుణ హత్యలకు గురి అయినారు. ఈ హత్యలన్నీ రాత్రివేళలోనే జరిగాయి.

ఐ.ఎ.ఎస్ అభ్యర్థుల ఎంపిక పద్ధతిపై కమిటీ పరిశీలన

న్యూఢిల్లీ, జూన్ 5 (పి. టి. ఐ)

ఐ.ఎ.ఎస్; ఐ.పి.ఎస్; ఇతర కేంద్ర సర్వీసులకు అభ్యర్థుల ఎంపికకు ప్రస్తుతం అవలంబిస్తున్న పద్ధతిలో మార్పులు అవసరమా అనే అంశంపై కేంద్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్, విద్యావేత్తలు పాలనాదక్షులు, వృత్తి సంస్థల అభిప్రాయాలను సేకరిస్తున్నది.

మీ అభిప్రాయంలో ఈ సర్వీసులలో చేరే అభ్యర్థుల పరిజ్ఞానం నైపుణ్యాలు, వ్యక్తిత్వం మానసిక ప్రవృత్తి, ఉద్దీపనా శక్తి ఏ విధంగా ఉండాలి.

మీ అభిప్రాయంలో యీ సర్వీసులకు ఎంపిక చేసిన అభ్యర్థులు తమ బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించడానికి ప్రధానంగా వారిలో ఉండాల్సిన లక్షణాలు ఏమిటి?

కమిషన్ సమాధానాలు కోరుతున్న ప్రశ్నావళి పత్రంలో ఇలాంటి 16ప్రశ్నలు ఉన్నాయి.

డాక్టర్. డి.ఎన్. కొఠారి అధ్యక్షతన కమిషన్ ఏర్పాటుచేసిన ఉపసంఘం యీ ప్రశ్నావళిని ప్రముఖులకు పంపినది. నాలుగు నెలల కాలంలో నివేదిక సమర్పించగలమని కమిటీ భావిస్తున్నది.

పాకిస్తాన్‌లో అణుశక్తివిస్తరణ పథకాలకు కెనడా సహాయం

న్యూఢిల్లీ, జూన్ 5 (పి.టి.ఐ.)

పాకిస్తాన్‌లో తొలి అణు విద్యుత్ కేంద్రం నిర్మించిన కెనడా ఇప్పుడు పాకిస్తాన్‌లో యురేనియం ఇంధనం తయారీకి ఫ్యాక్టరీ ఏర్పాటుకై 17 లక్షల డాలర్ల వడ్డీలేని రుణం ఇవ్వడానికి సంసిద్ధత ప్రకటించినది.

అణ్వాయుధ వ్యాప్తి నిరోధక ఒప్పందంపై పాకిస్తాన్ సంతకాలు చేయలేదు.

ఇక దేశపు అణు అభివృద్ధి కార్యక్రమంలో యీ ఫ్యాక్టరీ ఏర్పాటు అతి ప్రధాన ఘట్టం ఈ ఫ్యాక్టరీ కరాచీ సమీపంలోని కనూప్‌రియాక్టర్‌కు అవసరమైన ఇంధనం కడ్డీలను తయారుచేస్తుంది. ఈ రియాక్టర్ 1971 ఆగస్టులో పని ప్రారంభించినది. 1972 నవంబర్‌లో భుట్టో అధికారికంగా దీనికి ప్రారంభోత్సవం చేసారు. 1973 జూలైనుండి 125 మెగావాట్ల శక్తితో పని చేస్తున్నది.

కనూప్ కేంద్రంలో ప్లూటోనియం తయారీకి అవకాశం ఉన్నది.

"న్యూక్లియర్ ఇంజనీరింగ్ ఇంటర్నేషనల్" పత్రిక ఏప్రిల్ సంచికలో యీ అంశాలు ప్రచురించినది. ఇంధనంతయారీ ఫ్యాక్టరీ నిర్మాణం పని ప్రారంభమైనది.

అణురియాక్టర్‌లో ప్లూటోనియం తయారికి అతిప్రధానమైన భారజలం ఉత్పత్తికి 11 కోట్ల వ్యయంతో ఫ్యాక్టరీ ఏర్పాటు చేయాలని కూడా పాకిస్తాన్ ప్రతిపాదించినది. యురేనియంపై పరిశోధనా కార్యక్రమం కూడా ప్రారంభమైనది.

కానూప్ కేంద్రానికి నాలుగు రెట్లు పెద్ద అణువిద్యుత్ కేంద్రాన్ని నిర్మించాలని పాకిస్తాన్ ప్రతిపాదించినట్టు కూడా ఆ పత్రిక ప్రచురించినది.

అణుశక్తి విస్తరణ పథకాలేకాక, వ్యవసాయం, ఆహార ధాన్యాలు, పప్పులింగు కార్యక్రమాలకు అణుశక్తి వినియోగం పరిశోధనలుకూడా కొనసాగిస్తున్నది.

పాకిస్తాన్ అణుపరిశోధన కార్యక్రమాలకు అంతర్జాతీయ అణుశక్తి సంస్థ, ప్రపంచ ఆహార వ్యవసాయసంస్థ సహాయం చేస్తున్నాయి.

ఈజిప్టు సైన్యాల లక్ష్యంపై సాదత్ వివరణ

కైరో, జూన్ 5 (రాయిటర్)

లక్ష్యసాధన ఇంకా పూర్తికాలేదని ఈజిప్ట్ సైన్యానికి ప్రెసిడెంట్ అన్వర్ సాదత్ నిన్న చెప్పారు. ఇకముందు ఓటమి లేదు. అన్నీ విజయాలే అని ఆయన అన్నారు.

సూయజ్ కాలువ రంగంలో ఈజిప్ట్ సేనల నుద్దేశించి ప్రసంగిస్తూ ఆయన అలా అన్నారు. ఆయన ప్రసంగాన్ని కైరో రేడియో ప్రసారం చేసినది.

అరబ్ భూభాగాలనుండి విదేశీ సైన్యాలన్నిటినీ ఉపసంహరించుకునేటంతవరకు ఈజిప్ట్‌సైన్యం లక్ష్యసాధన పూర్తికాదని ఆయన చెప్పారు.

అర్చకుల జీతాలు పెంచాలని విజ్ఞప్తి

హైదరాబాద్, జూన్ 5

రాష్ట్ర అర్చక సమాఖ్య కార్యదర్శి శ్రీ ఆర్. ఎస్. గోపాలకృష్ణ నేడొక ప్రకటన చేస్తూ జీవన వ్యయభారం పెరిగిపోతున్న దృష్ట్యా రాష్ట్రంలోని దేవాలయాల్లో అర్చకుల జీతాలను, పదిశాతాన్ని పెంచాలనీ, గత అర్థశతాబ్దిగా పరిష్కారంకాని అర్చక సమస్యలను పరిష్కరించాలనీ, నానాటికి దిగజారుతున్న దేవాలయాల స్థితిగతులను మెరుగుపరచాలనీ తమ సమాఖ్య పక్షాన ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేశారు.

దేహాన్ని కోయకుండా పోస్‌మార్టమ్

టెల్‌అవీవ్, జూన్ 5 (ఎ.ఎఫ్ పి)

దేహాన్నికోయకుండా పోస్టుమార్టమ్ చేయడానికై ఇజ్రాయిల్ శాస్త్రవేత్తలు కొత్త పద్ధతిని కనిపెట్టారు.

ఈ పద్ధతివల్ల దేహంపై కోతపడదు. మత సంబంధమైన కారణాలపై శవ పరీక్షకు అంగీకరించని సందర్భాలలో యీ పద్ధతి ఉపయోగ పడుతుంది.

ఒక ప్రత్యేక ద్రవాన్ని శరీరంలోకి ఎక్కించడంవల్ల ఎక్సరేలో ఎముకలు స్పష్టంగా కానరాకుండా చేయవచ్చు దీనివల్ల డాక్టర్లు రక్తనాళాలను, కాలేయం, మూత్రపిండాలువంటి అవయవాలను స్పష్టంగా చూడగలుగుతారు.

విజయవాడలో ప్రత్యేక స్టెరిలైజేషన్ వార్డు

(ఆంధ్రభూమి ప్రతినిధి)

విజయవాడ, జూన్ 5

విజయవాడలోని ప్రభుత్వ ఆస్పత్రిలో 1 లక్ష 40 వేల ఖర్చుతో ప్రత్యేక స్టెరిలైజేషన్‌వార్డు నిర్మాణంత్వరలో ప్రారంభం అవుతుందని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వి. నాగభూషణం పత్రికా ప్రతినిధుల సమావేశంలో చెప్పారు.

డాక్టర్ నాగభూషణం రాజమండ్రికి బదిలీ అయిన సందర్భంగా ఏర్పాటైన సమావేశంలో ఆయన ప్రసంగిస్తూ పై విషయం చెప్పారు.

ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా పదవీ బాధ్యతలు స్వీకరిస్తున్న డాక్టర్ గోవింద రాజులు మాట్లాడుతూ విజయవాడలో కీళ్ళ నొప్పుల చికిత్సకు ఒక విభాగం అవసరమనీ, పడకల సంఖ్య కనీసం 3 వందలకైనా పెంచడం అవసరమనీ అన్నారు.

డాక్టర్ నాగభూషణం బదిలీ సందర్భంగా ఆస్పత్రి సిబ్బంది ఆయనకు వీడ్కోలు ఇచ్చారు.

ఈ సమావేశానికి విధాన సభ సభ్యుడు శ్రీ డి. రామారావు అధ్యక్షత వహించారు.

డాక్టర్ రాజారావు, శాసన సభ్యుడు ఆసిఫ్ పాషా ప్రభృతులు డాక్టర్ నాగభూషణం ఆస్పత్రికి చేసిన సేవలను ప్రశంసించారు.

భూటాన్‌లో రాష్ట్రపతి వి. వి. గిరికి వీడ్కోలు

తింపు, జూన్ 5 (పి.టి.ఐ)

భూటాన్‌రాజు పట్టాభిషేక - మహోత్సవం సందర్భంగా ఇక్కడికి వచ్చి నాలుగు రోజులు గడిపిన రాష్ట్రపతి శ్రీ వి. వి. గిరి దంపతులు, హవిమార్గంగా నేడు న్యూఢిల్లీకి బయలు దేరారు.

కేంద్ర సమాచారమంత్రి శ్రీ గుజాల్, తదితరులు రాష్ట్రపతివెంట బయలుదేరారు.

భూటాన్‌రాజు జిగ్మిసింఘి వాంగ్‌చుక్, రాజమాత, రాజకుటుంబ సభ్యులు. మంత్రులు, ఉన్నతాధికారులు రాష్ట్రపతి శ్రీ గిరికి, బంగ్లాదేశ్ అధ్యక్షుడు మహమదుల్లాకు విమానాశ్రయంవద్ద వీడ్కోలు చెప్పారు.

చిరునామా మార్పు నోటీసు

ది ఓరియంటల్ ఫైర్ అండ్ జనరల్ ఇన్స్యూరెన్సు కంపెనీ లిమిటెడ్‌వారి, హైద్రాబాద్ డివిజనల్ ఆఫీసు, సెంట్రల్ బ్యాంక్ భవనము ఆవరణ నుండిబ్యాంక్‌స్ట్రీట్, సుల్తానుబజారు, హైద్రాబాదులో యున్న మొదటిఅంతస్తు నంబరు 4-3-389 నుండి 392, 411, మరియు 422,కు (అనగా ఇండియన్ ఓవర్‌సీస్ బ్యాంక్ పై అంతస్తుకు) మార్చబడినది.

టెలిఫోను, పోస్టుబ్యాంగ్‌నంబర్లలో మార్పులేదు.

ఇట్లు

కె. నాగభూషణరావు

సీనియర్ డివిజనల్ సెక్రెటరీ

హైదరాబాద్ ఆస్బెస్టాస్ సిమెంట్ ప్రొడక్ట్సు లిమిటెడ్

ప్రకటన

దిగువ తెల్పిన వ్యవహారాల చర్చించుటకై హైదరాబాదు ఆస్బెస్టాస్ సిమెంట్ ప్రొడక్ట్స్ లిమిటెడ్ ఇరవై ఏడవ వార్షిక సర్వసభ్య సమావేశం 1974జూన్ 28వ తేది శుక్రవారం ఉదయం 11 00 గంటలకు హైదరాబాదు 500018 (ఆం. ప.) సనత్‌నగర్‌లోగల కంపెనీ రిజిస్టర్డు కార్యాలయంలో జరుగునని ఇందుమూలంగా తెలియజేయడమైనది.

1. 1973 డిసెంబరు 31తో అంతమయిన సంవత్సరానికి ఆడిట్ చేయబడినబాలన్స్ షీట్ మరియు లాభనష్టాలను డైరక్టర్లు మరియు ఆడిటర్ల నివేదికలను స్వీకరించి పరిశీలించుట
2. 1973 జూన్ 30తో అంతమయిన అర్థ సంవత్సరానికి ప్రిఫరెన్స్ షేర్లపై డైరెక్టర్లచే నిర్ణయింపబడిన డివిడెండ్ చెల్లింపును ఖాయపర్చుటకు.
3. ప్రిఫరెన్స్ మరియు ఈక్విటీషేర్లపై డివిడెండ్లు నిర్ణయించుటకు.
4. బోర్డు నుండి మామూలు ప్రకారం రిటైరవుతున్న (1) ప్రిన్స్‌ముప్పాభాన్ జాబహదూర్ (2) శ్రీ నూర్ మహమ్మద్ అల్లాదీన్ మరియు (3) శ్రీ కె. పి. సింఘ్‌లస్థానే డైరెక్టర్లను ఎన్నుకొనుట మరియు తిరిగి ఎన్నికకు వీరు అర్హులై వున్నారు.
5. ప్రస్తుత సంవత్సరానికి ఆడిటర్లను నియమించుట మరియు వారి వేతనాన్ని నిర్ణయించుట. ప్రస్తుతం వున్న ఆడిటర్లు మెస్సర్ ఎస్. జి. దస్తగిర్ అండ్ కంపెనీ, ఛార్టెడ్ ఎకౌంటెంట్స్ రిటైరవుతున్నారు మరియు తిరిగి నియామకానికి వీరు అర్హులు.
6. ప్రత్యేక వ్యాపారముగా

దిగువ తీర్మానాన్ని పరిశీలించి తగినదని భావించినచో మార్పుతోగాని లేదా మార్పులేకుండాగాని ఆమోదించుటకు.

ప్రత్యేక తీర్మానములుగా:-

ఎ. కంపెనీ సీనియర్ ఎగ్జిక్యూటివ్‌లకు ఏర్పాటుచేయబడిన ప్రావిడెంట్ ఫండ్ సెలవులు, వైద్య సదుపాయాలు వసతి కన్వేయన్స్ మరియు సమయానుకూలంగా ఇతర సౌకర్యములు ఇంక్రిమెంట్‌తో జీతం నెలకు సరాసరి రు. 3000/ లకు మించకుండా అట్టి షరతుల ప్రకారం కంపెనీ డైరక్టరైన శ్రీ నూర్‌మహమ్మద్ అల్లాదీన్ బంధువగు శ్రీ మసూద్‌అలిని కంపెని ఉద్యోగంలో ఇండస్ట్రియల్ ఇంజనీరుగా నియమించుటకు కంపెనీల 1956వ చట్టం సెక్షన్ 314 ప్రావిజన్ల ప్రకారం కంపెనీ ఆమోదించుటకు మరియు సమ్మతి మంజూరు చేయుటకు తీర్మానించవైనది.

బి. కంపెనీ ఇతర అధికారులకు సమయానుకూలంగా ఇవ్వబడే ప్రావిడెంట్ ఫండ్, బోనస్, సెలవు, మరియుఇతర లాభాలు మరియు సౌకర్యాలు మాత్రమేగాక ఇంక్రిమెంట్లతో జీతం (నెలకు సరాసరిన రు 2,000/ లకు మించకుండా) అట్టిషరతులపై కంపెనీ డైరక్టరు శ్రీ నూర్‌మహమ్మద్ అల్లాదీన్ బంధువగు శ్రీ రంజాన్‌అలి అబ్దులా కంపెనీ ఉద్యోగాన్ని కొనసాగించుటకు కంపెనీల 1956వ చట్టం సెక్షన్ 314 ప్రావిజన్ల ననుసరించి కంపెనీ ఆమోదించి అనుమతిని మంజూరు చేయుటకు తీర్మానించినది.

బోర్డు వారి ఆదేశానుసారం

హైదరాబాద్ ఆస్బెస్టాస్ సిమెంట్ ప్రొడక్ట్సు లిమిటెడ్

తరపున

జి. ఆర్. దేశాయ్

సెక్రటరీ- కంపెనీ లా

రిజిస్టర్డు కార్యాలయము:

సనత్‌నగర్,

హైదరాబాదు-500018 (ఆం.ప్ర)

తేది 25-5-1974

గమనిక: i) సమావేశానికి హాజరై ఓటు చేయుటకు అర్హుడగు సభ్యుడు తన బదులుగా హాజరై ఓటు చేయుటకు ప్రాక్సీని నియమించుకొనుటకు అర్హుడు, మరియు అట్టి ప్రాక్సీ కంపెనీ సభ్యుడై నుండనవసరం లేదు.

ii కంపెనీల 1956వ చట్టం సెక్షన్ 154 ననుసరించి కంపెనీ సభ్యుల రిజిస్టరు 1974 జూన్ 17వ తేదీ నుండి 28వ తేదీ వరకు (రెండు రోజులు కలుపుకొని) మూసి వుంచబడును.

iii డివిడెండ్లు నిర్ణయింపబడినపుడు 1974 జూన్ 28వ తేదీ నాటికి వున్నట్టి రిజిస్టరయిన షేర్‌హోల్డర్లకు లేదా వారి మాన్‌డేట్స్‌కు 1974 జూలై 8వ తేదీ తదుపరి చెల్లించబడును.

గమనిక: 1956 కంపెనీల చట్టం సెక్షన్ 178 ప్రకారం కోరబడిన విధంగా బటములు 6 (ఎ) మరియు (బి)కి సంబంధించి వివరణాత్మకమగు పట్టిక నోటీసుతో బాటుగా సభ్యులకు పంపబడినది.

కావలెను

జూనియర్ సర్వేయర్ కావలెను జీతం రు 150-5-175-6-205-ఇబి-7-240

విద్యాయోగ్యతలు: 1 సర్వేయింగ్‌లో (మెట్రిక్యులేషన్ తదుపరి రెండు సంవత్సరాల కోర్సు) గుర్తింపబడిన పాలిటెక్నిక్ సర్టిఫికేట్‌ను కల్గివుండాలి. (2) సర్వేయింగ్‌లో ఒక సంవత్సరం అనుభవము. వయస్సు:-18 మరియు 25 సంవత్సరాల మధ్య వుండాలి.

డెస్టిమోనియల్స్ వగైరాలతోదరఖాస్తులు రీజినల్ కంట్రోలర్ ఆఫ్ మైన్స్, ఇండియన్ బ్యూరో ఆఫ్ మైన్స్, 3-6-170, హైదర్‌గూడా, పోస్ట్ హిమాయత్‌నగర్, హైదరాబాదు-500029కు, 20-6 1974 వతేదీలో చేరునట్లుగా పంపాలి.

(DAVP 606(15)/74

గమనిక

ఖమ్మం ఆపరేషన్ సర్కిల్ అనగా ఖమ్మం మరియు నల్గొండ జిల్లాలలోని విద్యుచ్ఛక్తి వినిమయదారులకు తెలియజేయునదేమనగా, దయచేసి ఇకముందు కరంటుబిల్లుపైకమును ఎలక్ట్రిసిటీ రెవిన్యూ ఆఫీసులోగాని, మీ ఊరు ప్రతినెలావచ్చే బిల్‌కలకరునకుగాని, 14వ తారీఖువరకు పెనాల్టీలేకుండాను, మరియు 21వ తారీఖు లోపు పెనాల్టీతో పెనాల్టీ వచ్చేబిల్లులో కలుపబడును) చెల్లించి సరియైనరసీదు పొందవలెను. అట్టి రసీదుగాని, ఎలక్ట్రిసిటీ రెవిన్యూ ఆఫీసునుండి సంతకముతో తిరిగివచ్చిన మనియార్డరు రసీదుగాని, అంగీకరింపబడును. అట్టిరసీదు చూపని యెడల ఆయా సర్వీసులకు విద్యుచ్ఛక్తి నిలిపివేయబడును.

బి వి దీక్షిత్

సూపరింటెండింగ్ ఇంజనీర్

ఆపరేషన్‌సర్కిల్, ఖమ్మం

సౌత్ సెంట్రల్ రైల్వే

టెండరు ప్రకటన

1.4.1974 నుండి 31-8-1975 తేదివరకు గడువుకు మేడిచల్ సెక్షన్ మరియు మీర్జాపల్లి మేడిచల్, బొల్లారం, మల్కాజ్‌గిరి, కెవరి బారెక్స్ మనోహరాబాద్ మరియు నాసాయిపేట, పుష్పాబిడ్డి సెక్షనులలో కి మీ 566/0 వద్ద రన్నింగ్ కాంట్రాక్టు చేసిన్‌పై కోల్ యాప్‌ను అమ్ముటకు 14 6 1974వ తేదీ మధ్యాహ్నం 18-00 గంటలవరకు సీలువేయబడిన టెండర్లు దిగువ సంతకం చేసిన వారిచే ఆహ్వానింపబడుచున్నవి. రు 5/- లు ఖరీదు (ఐదు రూపాయలు మాత్రమే) గల టెండరు ఫారాలను 8-6-1974వ తేదీ మధ్యాహ్నం 18-00 గంటలవరకు దిగువ సంతకం చేసిన వారి కార్యాలయము నుండి పోస్టు ద్వారానూ మరియు తదుపరి 13 6.1974వ తేదీ మధ్యాహ్నం 13 00 గంటలవరకు స్వయంగానూపొందవచ్చును

ఇతర వివరాలు టెండరు ఫారంలో లభ్యమగును.

డివిజనల్ సూపరింటెండెంట్ (వర్క్స్)

సౌత్ సెంట్రల్ రైల్వే

సికింద్రాబాదు

(PUB-95/74-75)

పెండ్లి కుమార్తెలకు

వివాహాల చీరెలలో మర్చి ఎన్నిక

వాస్తవిక స్వప్న ప్రపంచం!

పెక్కు తేడాలతో ఎన్నో రకాలు

బనారసు * కంచి * ధర్మవరం * బెంగుళూరు * అస్సాం మరియు పోచంపల్లి సిల్కుచీరెలు * గద్వాల * వెంకటగిరి * సేలం కోయంబత్తూరు * మధురై * ఎరయూరు * మరియు పోచంపల్లి కాటన్ చీరెలు

ఒకసారి చూస్తే మీరే నమ్ముతారు!

జి. మల్లయ్య

(బట్టల దుకాణము)

పత్థర్‌గట్టి, మసీదువెనక, హైదరాబాదు

గ్రామ్: Uttam Beej ఫోన్: 56074

అగ్రికల్చరల్ కన్సల్టెన్సీ సప్లై అండ్ సర్వీసెస్

(రిజిస్టరయిన వ్యవసాయ నిపుణుల ఉమ్మడి సంస్థ)

5 3 287/288, హిందీనగర్, గోషామహల్, హైదరాబాద్ 500012 (ఆం.ప్ర.)

గ్యారంటీ తాజా విత్తనాలను ఆఫరు చేస్తున్నాము:

1. జొన్నలు: సిఎస్‌హెచ్. 1, సిఎస్‌హెచ్. 4 మరియు 302
2. సజ్జలు: హెచ్‌బి-3
3. మొక్కజొన్న: గంగ-5
4. ఆముదము: అరుణ, ఆర్-63 మరియు 157-బి
5. వరి ధాన్యం: తెల్ల హంస, రత్న మసూరి మరియు సి-1282P
6. ప్రత్తి: హెచ్-4
7. పెసలు: హెచ్‌బి-45

ఎరువుల కొరతను ఎదుర్కోవటానికి అజో అండ్ రైజో బాసీరియల్ కల్చర్లను ఉపయోగించండి! వినాశకరమగు వ్యాధుల బారి నుండి కాపాడుటకుమై క్రోనూట్రియంట్ ఫార్ములేషన్ అయిన మిసెనెల్‌ను ఉపయోగించండి!!

(తెలంగాణా ప్రాంతానికి డిస్ట్రిబ్యూటర్లు)

(artex)

ఇదో, ఇక్కడ ఒక క్రొత్త రకమైనది!

అజాక్స్

యస్‌ఎస్‌ఎస్ సీళ్లు తగలనివ్వని కాగితము



— అద్దంవంటి నునుపుదనానికి

కార్బొరండమ్ యూనివర్సల్ లిమిటెడ్

మద్రాసు • కలకత్తా • బొంబాయి • న్యూ ఢిల్లీ

SISTA'S-CU-2/74 TB

SSC తుషాన్

సీలింగ్ ఫ్యాన్

6 సాంకేతి కాంశములు గొప్ప

మన్నికనూ, ఎక్కువ గాలినీ కలుగ జేయును

1 సమర్థంగా రూపొందించబడిన మోటారు మితవ్యయంతో కూడిన అధిక మన్నికను కలుగ జేయును.

2 శాస్త్రీయంగా కోణింపబడి సరినమాన తూకం కల రెక్కలు విస్తారమైన గాలిని చాలా మేరవీచేలా చేసి, తూలు, అదురు లాంటి వాటిని పూర్తిగా తొలగించును. ద

61 కోట్ల మేరకు స్వీడన్ ఆర్థిక సహాయం

న్యూఢిల్లీ, జూన్ 5 (పి.టి.ఐ)

1974 75,76 77 సంవత్సరాల కాలానికి 61 కోట్ల 89 లక్షల రూపాయిల మేరకు ఆర్థిక సహాయం చేయడానికి స్వీడన్ నేడు వాగ్దానం చేసింది.

ఈ రుణానికి వడ్డీలేదు. తిరిగి తీర్చడానికి 50 సంవత్సరాల గడువు ఉంటుంది. ప్రపంచంలో ఏ దేశం నుండి అయినా దిగుమతులకు ఈ మొత్తాన్ని ఉపయోగించుకోవచ్చు.

అభివృద్ధి సాధన సహకారానికి సంబంధించిన ఈ ఒప్పందంపై ఆర్థిక మంత్రిత్వశాఖ కార్యదర్శి శ్రీ ఎస్. జి. కౌల్ న్యూఢిల్లీలోని స్వీడిష్ రాయబారి నేడు సంతకాలు చేశారు.

ఈ మొత్తంలో 32 కోట్ల 7 లక్షలు 1974–75 సంవత్సరానికి, 29 కోట్ల 32 లక్షల రూపాయలు ఆ తర్వాత సంవత్సరానికి వినియోగించుకోవలసి ఉంటుంది.

అణుసాధన పరీక్షపై రాయబారి కౌల్ వివరణ

న్యూఢిల్లీ, జూన్ 5

అమెరికాలోని భారత రాయబారి శ్రీ టి. ఎన్. కౌల్ సుప్రసిద్ధులను శ్రీ హార్డ్ కీ ఆగ్రహానికి గురిచేశారు. ఆ శ్రీ టాస్ న్యాయశాస్త్రోపన్యాసాన్ని ప్రముఖుల కేంద్రం అధ్యక్షులు జెనీవాలోని నిరాయుధీకరణ వ్యవహారాల సంస్థ మాజీ ఉపనిమంత్రణాధికారి అయిన శ్రీ ఎస్ మెక్ ఫిలర్‌తోనూ అర్థగంటకుపైగా జరిపిన చర్చ మే 31వ తేదీన వాషింగ్టన్ నుంచి టెలివిజన్‌లో ప్రసారం అయింది. వారు ఇద్దరు అణుశక్తికి సంబంధించిన సాంకేతిక రంగంలో అందరు ముఖ్యంగా విద్యుచ్ఛక్తిరంగం రేంద్రాలను సంబంధించిన రంగంలో భారతదేశం గొప్ప పురోగతి సాధించుకుపోతోందని పేర్కొనారు. ఆయితే భూగర్భంలో అణుసాధన పాటవ పరీక్ష జరిపవలసిన అవసరం అందుకయ్యే ఖర్చు విషయంలో అనుమానాలు వ్యక్తం చేయడమేకాక ఇదిగాంధేయపద్ధతికి భిన్నం కాదా అని ప్రశ్నించారు. వారి ప్రశ్నలకు సమాధానం ఇస్తూ శ్రీ కౌల్ అగ్రరాజ్యాలన్నీ కూడా అణ్వాయుధాలు తయారు చేయడానికి తమ శక్తి సామర్థ్యాలు వినియోగిస్తుండగా భారతదేశం అణుశక్తిని శాంతియుత ప్రయోజనాల కోసం ఉపయోగించడానికి కృషి చేస్తున్నదనీ, భాభా, సారాభాయ్, సేథ్నా, రామన్న వంటి భారతీయుల శాస్త్రజ్ఞులు చమురు, ఖనిజ వాయువు ఉత్పత్తి పెంపుదల నిమిత్తం భూగర్భంలో అణుసాధనం ప్రేల్చడంవల్ల ప్రయోజనం కలుగుతుందని రుజువుచెయ్యడానికి పూనుకొన్నారనీ, ప్రజల ఆశయాలకు అనుగుణంగా అభివృద్ధి సాధించడానికి భారతదేశం గట్టిగా కృషి చేస్తున్నదనీ, అణుసాధన పాటవ పరీక్షకు చాలా స్వల్పమొత్తం మాత్రమే వ్యయం చెయ్యడం జరిగిందనీ తెలియజేశారు. ఇంతకుముందు జరిగిన ఒప్పందాలను నేటినీకూడా భారతదేశం ఉల్లంఘించలేదని, ఈ నాడు గాంధీ మహాత్ముడు జీవించి ఉన్నా శాంతియుత ప్రయోజనాలకోసం జరిపిన ఈ ప్రయోగాలపట్ల హర్షమోదాలు తెలియజేసి ఉండేవారనీ శ్రీ కౌల్ అన్నారు.

విదేశీ ద్రవ్య ఆదాయానికై వినోద యాత్రాభివృద్ధి

అధికారుల సమావేశంలో రాజబహదూర్ వెల్లడి

న్యూయార్క్, జూన్ 5

బయిదవ ప్రణాళికా కాలంలో వినోద యాత్రాభివృద్ధి నిమిత్తం చేపట్టే కార్యక్రమాలలో విదేశీ మారక ద్రవ్య ఆర్జనకు ఎక్కువ అవకాశం ఉండే కార్యక్రమాలకు అధిక ప్రాధాన్యం ఇవ్వడం జరుగుతుందని కేంద్ర వినోద యాత్రలు, పౌరవిమాన యాన శాఖమంత్రి శ్రీ రాజబహదూర్ చెప్పారు.

విదేశాలలో ఉన్న భారతీయ వినోద యాత్రా వ్యవహారాల అధికారుల చతుర్థ వార్షిక సమావేశానికి సోమవారం ప్రారంభోత్సవం చేస్తూ శ్రీ రాజబహదూర్ అలా చెప్పారు.

మూడు రోజులపాటు జరిగే ఈసమావేశానికి ఐరోపాలోనూ, అమెరికాలోనూ, ఉన్న భారతీయ వినోదయాత్రా వ్యవహారాల అధికారులేకాక ఏర్ ఇండియా, ఇండియన్ ఎయిర్‌లైన్స్ సంస్థల ప్రతినిధులు, వినోద యాత్రాభివృద్ధి వ్యవహారాల శాఖకు చెందిన ప్రతినిధులు కూడా హాజరవుతున్నారు.

మనదేశంలో విదేశీ వినోద యాత్రికులు కనీసం రోజులపాటు ఉండడానికి వీలుకల్పిస్తూ భారత ప్రభుత్వం ఉత్తరువు జారీచేసిందని శ్రీ రాజబహదూర్ ఈ సమావేశంలో ప్రకటించారు. ఈ ఉత్తరువు రెండేళ్ళపాటు అమలులో ఉంటుంది. విదేశీ వినోదయాత్రికులకు ఇలాంటి సదుపాయం కల్పించిన దేశాల సంఖ్య చాలా తక్కువ. ఈ సదుపాయం మన దేశానికి వచ్చే విదేశీ వినోద యాత్రికులకు ప్రత్యేక ఆకర్షణగా ఉండగలదు. ఇంతవరకు విదేశీ వినోద యాత్రికులు మన దేశంలో 21 రోజుల పాటు మాత్రమే ఉండడానికి వీలు ఉన్నది.

మనదేశంలోని వినోదయాత్రా స్థలాలు అక్కడ ఉన్న సదుపాయాలు మొదలైన విషయాలను వివరించే పుస్తకాలు ఆకర్షణీయంగా, ఆసక్తిని ఆకట్టుకొనే విధంగా రూపొందించాలని శ్రీ రాజబహదూర్ అన్నారు.

వినోదయాత్రల రంగంలో మనం మన దేశ సంస్కృతిని ప్రతిబింబింప చేయాలనీ విదేశీయుల జీవన విధానాలకు విదేశీ సంస్కృతులకు అనుకరణలు కూడవనీ శ్రీ రాజబహదూర్ చెప్పారు. మన ప్రజలలో విదేశీ యాత్రికులపట్ల సానుభూతినీ, మైత్రీ భావాన్నీ పెంపొందింప చేయడానికి గట్టి కృషి జరగాలని కూడా ఆయన అన్నారు.

దేశంలోని ప్రధాన వినోదయాత్రా కేంద్రాలలో ఇప్పుడు హోటల్ సదుపాయాలు తగినంతగా ఉన్నాయని శ్రీ రాజబహదూర్ చెప్పారు. 1973లో బొంబాయిలో కొత్తగా ఎన్నో హోటళ్ళు తెరవడం జరిగింది. ఇప్పుడు మద్రాసులో హోటల్ సదుపాయాలు పెంచడానికి గట్టి ప్రయత్నాలు జరుగుతున్నవి. 1974 75లో ప్రధాన వినోదయాత్రా స్థలాలలో కొత్తగా 20 హోటళ్ళు ఏర్పాటవుతాయి. ఈ హోటళ్ళలోని గదుల సంఖ్య 2,089 ఉంటుంది. గత కొన్ని సంవత్సరాలలో హోటళ్ల పురోగతి సాధించిన అభివృద్ధిని సమీక్షించి, వచ్చే అయిదేళ్లలో ఈపరిశ్రమ అభివృద్ధికి తీసుకోవలసిన ప్రోత్సాహక చర్యలను సిఫార్సుచేసే సమితికి శ్రీ ఎస్. భూతలింగం అధ్యక్షతన ఒక సంఘం ఏర్పాటయింది.

అయిదవ ప్రణాళికా కాలంలో 1974 78 సంవత్సరాల మధ్య వినోదయాత్రల అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర రంగాలకుగా 112 కోటి కేటాయించడం జరిగిందనీ, వినోదయాత్రల రంగంలో పెట్టుబడులు పెట్టుబడులు ఏ మేరకు ఉంటాయో ఇంకా అంచనా వేయలేదనీ శ్రీ రాజబహదూర్ పేర్కొన్నారు. కేంద్ర రంగంలో చేపట్టే పథకం కింద ప్రైవేటు రంగంలోని హోటళ్ళకు ఋణాలు ఇచ్చి ఏర్పాటుకూడా ఉన్నది.

Printed by K. R. Pattabhiram B.A., for the Proprietors of The Deccan Chronicle Press 36, Sarojini Devi Road, Secunderabad Managing Editor and Publisher K. R Nandagopal L.M E.E. Editor: Gora Sastry.

హిందీ 'భగీరథ' పత్రిక ఆవిష్కరణ

న్యూఢిల్లీ, జూన్ 4 (పి టి ఐ)

ఇరిగేషన్–విద్యుచ్ఛక్తి మంత్రిత్వశాఖ మూడు నెలల కాలపరిధిలో హిందీలో ప్రచురణ ప్రారంభించిన "భగీరథ పత్రిక"ను కేంద్ర ఇరిగేషన్–విద్యుచ్ఛక్తి శాఖ మంత్రి శ్రీ కె.సి పంత్ నిన్న ఆవిష్కరించారు.

ఇరిగేషన్, విద్యుచ్ఛక్తి రంగాలలో ప్రభుత్వం అమలు పరుస్తున్న అభివృద్ధి కార్యక్రమాలగురించి గ్రామీణ ప్రజలకు తెలియచెప్పడం ఈ పత్రిక ఆశయం.

ఆవిష్కరణోత్సవ సభలో శ్రీ పంత్ ప్రసంగిస్తూ, అభివృద్ధి సాధనకు కీలకమైన నీటిపారుదల, విద్యుచ్ఛక్తి రంగాలలో స్వయం పోషకత్వ సాధనకు చేపట్టవలసిన ఆవశ్యకతను నొక్కివక్కాణించారు.

వ్యభిచార నేరం క్రింద ఐదుగురికి జరిమానా

(ఆంధ్రభూమి ప్రతినిధి)

హైదరాబాద్, జూన్ 5

వ్యభిచార నిరోధక చట్టం క్రింద అరెస్టు చేయబడి కోర్టులో హాజరుపరచిన ఐదుగురు యువతులకు నగర మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ 50 రూపాయలచొప్పున జరిమానా విధించారు.

బిగంబజారులోని ఒకలాడ్జిపై పోలీసులు గత ఆదివారం దాడిచేసి 16–17 సంవత్సరాల వయస్సుగల ఈయువతులను అరెస్టుచేశారు. వీరు కాకినాడ, రాజమండ్రి గుంటూరులనుండి వచ్చారు.

యెల్లారెడ్డి స్థానే మధ్నూరుకు రిజర్వుడ్ సీటు

(ఆంధ్రభూమి విలేకరి)

నిజామాబాద్, జూన్ 5

గత మూడు జనరల్ ఎలక్షన్స్‌లో యీ జిల్లాలో ఏకైక రిజర్వుడు నియోజకవర్గంగా వుండిన యెల్లారెడ్డి తాలూకాను జనరల్ నియోజకవర్గంగాచేసి, దాని స్థానే మధ్నూరును రిజర్వుడు నియోజకవర్గంగా మార్చినట్లు విశ్వసనీయవర్గాల ద్వారా తెలిసింది.

నకరేకల్ సమితి సిబ్బంది సంఘం

నకరేకల్, జూన్ 5

నల్లగొండ జిల్లా నకరేకల్ సమితి పంచాయత్‌రాజ్ మినిస్టీరియల్ సిబ్బంది సంఘం కార్యవర్గ సభ్యులుగా క్రింది వారు ఎన్నికైనారు.

శ్రీయుతులు బి. మట్టపల్లి (అధ్యక్షుడు) సి. నారాయణ గౌడ్ (ఉపాధ్యక్షుడు), మహమ్మద్ ఉస్మాన్ (కార్యదర్శి), మహమ్మద్ షాబుద్దీన్ ఖాన్ (కోశాధికారి).

ఆకాశవాణి

శుక్రవారం 7-6-1974

హైదరాబాద్-ఎ

ప్రసారము 1

ఉ॥ 6–00 వందేమాతరం 6–04 మంగళధ్వని, కార్యక్రమ వివరణ 6–10 భక్తిరంజని 6–40 సూక్తిముక్తావళి 6–45 పాలం పనులు 6–55 వాద్యగోష్ఠి 7–15 గాంధీమార్గము 7–25 చిత్రసీమ 7–40 ప్రాంతీయ వార్తలు 7–45 సంగీత సుధ 8–20 శాంతా చక్రవర్తి 9–00 ప్రసార సమాప్తి.

ప్రసారము 2

మ॥ 12 05 శాంతాచక్రవర్తి 12–20 హిందీ పాఠము 12–40 కార్మికుల కార్యక్రమము 1–10 సంగీత సుధ 1–25 పాడి–పంట 1–30 తరుణిమండలి శ్రీలు కార్యక్రమము 1–59 వాతావరణ సూచన 2–10 ప్రసార సమాప్తి.

ప్రసారము 3

సా॥ 5–30 వైస్రుబహ్మణ్యం; వేణువు 6–05 ప్రాంతీయ వార్తలు 6–15 ప్రాంతీయ వార్తలు (ఉర్దూ) (హైదరాబాద్, కడప మాత్రం) 6–25 స్థానిక ప్రకటనలు 6–30 మంజార మాల 6–50 ధరలు. వాతావరణము 6–55 మాటామంతి 7–15 గ్రామస్థుల రేడియోగోష్ఠి 7–40 సేద్య సమాచారం 7–45 చిత్రసీమ 8–00 సదుస్తున్న చరిత్ర జి. శ్రీహరి 8-10 విరామ సంగీతం 8–15 చిత్రగీతవలెను 8.30 లలిత సంగీతం 8–45 అంతస్సులు: నాటక రచన; గరిమెళ్ళ నరసింహశర్మ 9–15 సంగీత సాహిత్య సౌరభం 9–45 రాగం: తానం, పల్లవి: 10–30 ప్రసార సమాప్తి.

హైదరాబాద్-బి

ప్రసారము 1

ఉ॥ 6–30 వందేమాతరం, మంగళధ్వని కార్యక్రమ వివరణ 6–40 ఈశ్వర అల్లా తేరేనాం యువవాణి: 7–02 కార్యక్రమావళి 7–05 కర్ణాటక సంగీతం 7–20 నవ్వుల పువ్వులు 7–30 చిత్రసీమ 7–50 రేడియో కళాశాల 8–10 సుగుణ సంగీతం 8–25 విల్మగానే 9–00 మహబూబ్‌ఖాన్; సారంగి అనిల్ మొహితె; కాంచ్‌తరంగ్ 9–30 ప్రసార సమాప్తి.

ప్రసారము 2

మ॥ 1–45 వాద్య సంగీతం 2–00 రాగవైవిధ్య 2–20 విల్మగానే 2–30మజ్లిస్ 8–02 ప్రసార సమాప్తి.

ప్రసారము 3

సా॥ 5–30 యువవాణి కర్ణాటక సంగీతం 5–45 ఉర్దూ కార్యక్రమము 6–10 పాశ్చాత్య సంగీతం 6 40 చైతన్య స్రవంతి 7–02 కార్యక్రమావళి 7–05 లలిత సంగీతం 7–20 కల్పవల్లి 8–02 కార్యక్రమ విశేషాలు 8.05 మరాటీ కార్యక్రమము 8 25 సుగం సంగీత్ 9–00 అనిల్ మొహితె: కాంచ్ తరంగ్ 9–30 నైరంగ్ (ఉర్దూలో కార్యక్రమం) 10–30 ప్రసార సమాప్తి

పోలెండు ప్రతినిధి వర్గంతో సంప్రతింపులు

న్యూఢిల్లీ, జూన్ 5

పోలెండు, భారతదేశాల మధ్య దీర్ఘకాలిక ప్రాతిపదికపై వాణిజ్యాభివృద్ధి, సొమ్ము చెల్లింపునకుసంబంధించిన ఒప్పందాలవిషయమై ఉభయదేశాల ప్రతినిధులు ఇక్కడ సంప్రతింపులు ప్రారంభించారు. పోలెండు ప్రతినిధివర్గానికి పశుసంవర్ధక వాణిజ్యశాఖ ఉపమంత్రి శ్రీ స్టీఫన్ పర్కొవిస్కీ భారత ప్రతినిధివర్గానికి వాణిజ్య మంత్రిత్వశాఖ కార్యదర్శి శ్రీ వై టి. షా నాయకత్వం వహించారు. ఇవి ప్రారంభ చర్చలు. ఇవి ఆధారంగా వచ్చే అయిదేండ్లలో ఉభయదేశాలమధ్య వాణిజ్యాభివృద్ధి పణాళిక రూపొందించడం జరుగుతుంది. రిప్బ్లిక్ తర్వాత తూర్పు ఐరోపాలో మన దేశంతో పెద్ద ఎత్తున వ్యాపారం చేస్తున్నదేశం పోలెండ్.

అంకుశాపురంలో వ్యవసాయకూలీలసమ్మె

(ఆంధ్రభూమి ప్రతినిధి)

హైదరాబాద్, జూన్ 4

హైదరాబాద్ జిల్లా అంకుశాపురం గ్రామంలోని పోలీసు క్యాంపును సి. ఆర్. పి. క్యాంపును అక్కడ నుండి తొలగించాలనీ అక్కడి వ్యవసాయకార్మికుల సమ్మెను భగ్నంచేయడంలో భూస్వాములకు పోలీసులు తోడ్పడకుండా చూడాలని రాష్ట్ర పౌరహక్కుల సంఘం ప్రధాన కార్యదర్శి శ్రీ పి. వెంకటేశ్వర్లు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసారు.

అంకుశాపురంలో 150 మంది పాలేళ్ళు హెచ్చు వేతనాలకోసం ఐదు రోజులుగా సమ్మెచేస్తున్నారు.

పెద్ద ఎత్తున దోపిడీలు చేస్తున్న ముఠాల అరెస్టు

గుంటూరు, జూన్ 5 (పి టి ఐ)

వివిధ రకాల దోపిడీలను హత్యలను నాలుగు ముఠాలను గత వారం గుంటూరులోని నేర పరిశోధనాశాఖ సిబ్బంది పట్టుకొన్నారు. వీరి దగ్గరినుండి 80 వేల రూపాయల విలువచేసే ఆస్తులను కూడ స్వాధీనపరచుకొన్నారు.

గుంటూరు పోలీసు సూపరింటెండెంట్ శ్రీ ఆర్ పట్టాభిరామారావు పత్రికా ప్రతినిధుల సమావేశంలో ఈ విషయాలను తెలియజేశారు.

దారిదోపిడీలు చేస్తున్న ఎరుకల వెంకటి, నాగేంద్రాన్ని అతని అనుయాయులు, యోగయ్య, కోటేశ్వరరావులను అరెస్టుచేసి వీరి దగ్గరి నుండి మూడువేల రూపాయల విలువగల వస్తువులను స్వాధీనపరచుకొన్నారు.

సోమయ్య నాయకత్వంలోని నలుగురు సభ్యులుగల గూడూరుపురం ఎరుకల ముఠాను అరెస్టుచేసి, 10 వేల రూపాయల విలువచేసే ఆభరణాలను స్వాధీనం చేసుకొన్నారు. గత ఏప్రిల్ నెలలో పశ్చిమ గోదావరి జిల్లాలోఈముఠామీదుగా పెద్దదోపిడీకుట్ర చేశారు.

ధైవరకొండ కోటేశ్వరరావు నాయకత్వంలోని ముఠాను అరెస్టుచేసి 40 వేల రూపాయల విలువచేసే బంగారాన్ని, వస్త్రాలను స్వాధీనపరచుకొన్నారు. వీరిలో పెద్దవాడు ఇంతకు పూర్వం తాడేపల్లిలో నివసించిన ఎరుకలి ఈ ముఠా నాయకుడు కోటేశ్వరరావు బనగానపల్లి సిండికేటు బ్యాంకు దోపిడీకేసులో సంభంధం ఉన్నట్టు భావిస్తున్నారు. గుంటూరు, చిలుకలూరిపేట, సత్యనారాయణపేట, మంగళగిరి మొదలైన ప్రదేశాలలో ఈ ముఠా దోపిడీలు చేసారు.

విజయవాడకు చెందిన వంకాయలపాటి వెంకటేశ్వర్లు నాయకత్వంలోని నలుగురు సభ్యులు గల ముఠానుకూడా గాలించి పట్టుకొన్నారు. వీరి దగ్గరినుండి 8 వేల రూపాయల విలువచేసే వస్తువులను స్వాధీనపరచుకొన్నారు.

20 వేల రూపాయల విలువచేసే వజ్రాలను దొంగిలించిన పి సుబ్బారావు అనే వ్యక్తిని, మూడువేల విలువచేసే వజ్రాలను దొంగిలించిన కృష్ణమోహన్‌ని కూడా పోలీసులు అరెస్టుచేశారు. వీరిదగ్గరినుండి దోచుకొన్న మొత్తాన్ని స్వాధీనం చేసుకొని, సంవత్సరం చొప్పున కఠినశిక్ష విధించారు.

అమెరికా-సిరియాల మధ్య దౌత్యసంబంధాలు

డమాస్కస్, జూన్ 5 (రాయిటర్)

ప్రెసిడెంట్ నిక్సన్ వచ్చే వారంలో దూరప్రాచ్యంలో పర్యటన ప్రారంభించడానికి ముందే అమెరికా–సిరియాల మధ్య పూర్తిస్థాయిలో దౌత్యసంబంధాలు తిరిగినెలకొంటాయనిసిరియా ఉప ప్రధాని అబుల్ హాలీమ్ ఖద్దమ్ నిన్న ఇక్కడ ప్రకటించారు.

70ఏళ్లుగా ప్రజల్లో ఆధ్యాత్మిక స్ఫూర్తికలిగిస్తున్న మహాయోగి

కంచి కామకోటి పీఠాధిపతి జగద్గురు శంకరాచార్యకు ఉపరాష్ట్రపతి అభినందన

మద్రాసు, జూన్ 5 (పిటిఐ)

దాదాపు ఎడు దశాబ్దాలపాటు దేశ ప్రజలలో ఆధ్యాత్మిక స్ఫూర్తి రగిలించిన మహాయోగిగా కంచి కామకోటి పీఠాధిపతి శ్రీ శంకరాచార్య చంద్రశేఖర సరస్వతిని ఉపరాష్ట్రపతి శ్రీ జి. ఎస్. పాఠక్ నిన్న ఇక్కడ అభినందించారు.

శ్రీ శంకరాచార్య చంద్రశేఖర సరస్వతి 81వ జన్మదినం సందర్భంగా ఒక సాంకేతిక సంస్థ నిర్వహించిన సభలో ఉపరాష్ట్రపతి శ్రీ పాఠక్ మాట్లాడుతూ అద్వైత వేదాంత మార్గము, వేదాధ్యయన సంస్కృత పాండిత్యాభివృద్ధి శ్రీ శంకరాచార్య ఆధ్యాత్మిక ప్రబోధ లక్ష్యాలని అన్నారు.

అనాదిగా వస్తున్న వేద సాంప్రదాయ రక్షణకై ఆయన చేసినకృషి చారిత్రాత్మకమైనదనీ, ఆధునిక సమాజంలో ఎదురౌతున్న ప్రత్యేక సమస్యలను వాస్తవిక దృష్టితో ధైర్యంగా పరిష్కరిస్తూ సాంప్రదాయక విలువల పరిరక్షణకు ఆయన ఎంతో తోడ్పడ్డారనీ శ్రీ పాఠక్ అన్నారు.

శ్రీ శంకరాచార్య చంద్రశేఖర సరస్వతి నిజంగా జగద్గురువేనని శ్రీ పాఠక్ అభివర్ణిస్తూ ప్రపంచంలోని వివిధ దేశాలకు చెందిన మేధావులు ఆయనను సందర్శించి ఆయన బహుముఖ పాండిత్యానికి, ఆధ్యాత్మిక ఔన్నత్యానికి ముగ్ధులైనారనిఅన్నారు.

శ్రీ శంకరాచార్య సమాజంలోని వివిధ వర్గాల మధ్య ద్వేషభావాన్ని ఖండించారు. అన్ని మతాలపట్ల సమానభావంతోనే వ్యవహరించాలని ఆయన ఉద్బోధ. పరిపాలనా పరంగా దురాచారాలను వ్యతిరేకంగా ఆయన పెద్ద ఉద్యమం నడుపుతున్నారు. ప్రజలలో భక్తి తత్వం పెంపొందడానికి దేవాలయాల ఆవశ్యకతను ఆయన వివరించారు, అన్నారు శ్రీ పాఠక్.

ప్రజలకు ఆధ్యాత్మిక మార్గదర్శకత్వం ఎంతగానో అవసరమై ఉన్న తరుణంలో శ్రీ శంకరాచార్య మన మధ్యనే ఉండడం మన అదృష్టం. సాంకేతిక పరిజ్ఞానము, భౌతికసుఖాలపై పెచ్చుపెరిగిపోతున్న దృష్ట్యా నిర్వహణ సమాజ పరిస్థితులను ఎదుర్కొనగల మనోధైర్యాన్ని ప్రజలకు ఇవ్వగలదే ఆధ్యాత్మిక, నైతిక విలువల పాముఖ్యతను శ్రీ శంకరాచార్య ప్రబోధించారని శ్రీ పాఠక్ అన్నారు.

"ప్రధాని ఇందిర జీవిత చరిత్ర" ముఖ్యమంత్రి ఆవిష్కరణ

న్యూఢిల్లీ, మే 5 (పి.టి.ఐ.)

శ్రీమతి శరంతలా మసానీ వ్రాసిన "ఇందిరాగాంధి కథ" అనే గ్రంథం తెలుగు అనువాదాన్ని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి శ్రీ. వెంగళరావు నిన్న ఆవిష్కరించారు.

ఆంధ్రప్రదేశ్ స్వాతంత్ర్యయోధుడు పత్రికా రచయిత ఆయిన ఎం. ఎం. నాయుడు ఈ గ్రంథాన్ని తెలుగులోకి తర్జుమా చేశారు.

ముఖ్యమంత్రికి అంకితమిచ్చిన ఈ గ్రంథం ప్రధాని ఇందిరాగాంధీ జీవిత చరిత్రను వివరంగా తెలుగు పాఠకులకు అందిస్తున్నది.

ప్రాంతీయభాషలలో ఇట్టి గ్రంథాల ఆవశ్యకత కలదని దేశ సమస్యల పరిష్కారానికి ప్రధాని అనుసరిస్తున్న కృషి, ఆమె సమర్థమైన నాయకత్వం గురించి ప్రజలు తెలుసుకొనగలరని ఇది ప్రజలకు ప్రోత్సాహకారిగా ఉండగలదని ముఖ్యమంత్రి తమ ప్రసంగంలో తెలిపారు. ఎం. ఎ. నాయుడుకు ఆయన అభినందనలు తెలిపారు.

రాజమండ్రిలో వడగాడ్పులు

రాజమండ్రి, జూన్ 5 (పి.టి.ఐ)

వారంరోజులుగా రాజమండ్రిలో ఎండలు చాలా తీవ్రంగా ఉంటున్నాయి. రోజంతా వడగాడ్పులు వీస్తున్నాయి. నిన్నటి రోజు గరిష్ఠ ఉష్ణోగ్రత 110 డిగ్రీలు ఉన్నది.

బీబీగూడెం గ్రామంలో 62 పూరిళ్లు దగ్ధం

విజయవాడ, జూన్ 5 [పిటిఐ]

గన్నవరం సమీపంలోని బీబీగూడెం గ్రామంలో నిన్నసంభవించిన అగ్ని ప్రమాదంలో 62 పూరిళ్లు దగ్ధమైనవి.

లక్షరూపాయల వరి ధాన్యం కూడా తగులబడి పోయింది.

ఇళ్లు కోల్పోయిన కుటుంబాలకు 200 రూపాయల వంతున ధన సహాయం ఇస్తామని తహసిల్దార్ శ్రీ కె. సీతారామయ్య ప్రకటించారు.

మహత్తరమైన ఫోర్‌హెన్స్ వినోదవిహారం పోటీ

'మీ స్వప్నసీమ' వినోదవిహారంకు ఫోర్‌హెన్స్ మార్గాన విమానంలో వెళ్లండి!

103 బహుమతులు ! రూ. 30,000 గెలుచుకోవచ్చును !

మొదటి బహుమతి : 2 పూర్తి మరియు 2 అర విమాన ప్రయాణ టిక్కెట్లు, భారతదేశంలో ఎచ్చటికైనా సరే వెళ్లటకు మరల తిరిగి వచ్చుటకు, దానితోపాటు రూ. 2,500/– "వెచ్చించుటకు సొమ్ము" లేక రూ. 5,500/– రొఖం.

2వ, బహుమతి : 2 పూర్తి విమాన ప్రయాణ టిక్కెట్లు, భారత దేశంలో ఎచ్చటికైనా సరే వెళ్లటకు మరల తిరిగి వచ్చుటకు, దానితోపాటు రూ. 1,500/– "వెచ్చించుటకు సొమ్ము" లేక రూ. 4,500/– రొఖం.

3వ, బహుమతి : 2 పూర్తి విమాన ప్రయాణ టిక్కెట్లు, భారతదేశంలో ఎచ్చటికైనా సరే (అత్యంత దూరపు పరిమితి 3000 కి.మీ.) వెళ్లటకు మరల తిరిగి వచ్చుటకు. దానితోపాటు రూ. 1000/– "వెచ్చించుటకు సొమ్ము." లేక రూ. 2000/– రొఖం.

విశేష అదనపర పారితోషకం! 100 ఫిలిప్స్ విషయా '72 పాకెట్ ట్రాన్సిస్టర్లు ప్రోత్సాహక బహుమతులుగా ఇవ్వబడును.

శ్రీనగర్, నీలగిరి, డార్జిలింగ్...మీరు ఎచ్చటకు వినోద విహారంకు వెళ్లెదరో నిర్ణయించండి. మహత్తరమైన ఫోర్‌హెన్స్ వినోదవిహారం పోటీ మిమ్ములను మరియు మీ కుటుంబమును అచ్చటకు చేర్చగలదు. ఇది సులభం ! ఇది ఉల్లాసకరం ! మరియు ప్రవేశ రుసుము లేదు. ప్రవేశ పత్రమును పూరించండి అంతే మరియు దానిని నేడే పంపండి.

షరతులు మరియు నిబంధనలు !

1. మీరు ఎన్ని ప్రవేశపత్రములైనా పంపవచ్చును. ప్రతి ప్రవేశ పత్రముతోను ఫోర్‌హెన్స్ టూత్ పేస్టు యొక్క ఏ సైజైనా అట్టపెట్టెనుండి 'ఎఫ్' అక్షరాన్ని కత్తిరించబడిన పైభాగపు చివరిముక్క మరియు పరచి పంపవలెను. పైభాగపు చివరిముక్క మరియు పరచబడకపోవటం వంటి ప్రవేశ పత్రములు తిరస్కరించబడును.
2. మీ పేరు, వయస్సు, మరియు పూర్తిగా చిరునామా స్పష్టంగాను, చదవదగినదిగాను (ప్రైవేటు లేఖ ఇంగ్లీషులో) అందుకోసం నియమించబడిన స్థలమందు వ్రాయవలెను.
3. అన్ని ప్రవేశపత్రములను మహత్తరమైన ఫోర్‌హెన్స్ వినోదవిహారం పోటీ పోస్టు బ్యాగ్ నం. 11456 బొంబాయి- 400 001 కు 10 జూలై 1974 సాయంత్రం 5 గం. లోగా చేరునట్లు పంపవలెను.
4. ప్రవేశపత్రములు మధ్యలో పోయినను, ఆలసింపబడినను, లేక చెడిపోయినను బాధ్యతవహించబడదు.
5. ప్రవేశపత్రములు ప్రత్యేకంగా నియమింపబడిన తీర్పరులచేత ముందుగా చేరిన ప్రవేశపత్రముల యొక్క సరియైన క్రమమునుబట్టిన్ని, దిగువవాక్యము వందలి మహత్త్వ కారణ విశిష్టతనుబట్టిన్ని తీర్పుచేయబడును. "నేను ఫోర్‌హెన్స్ టూత్ పేస్టును క్రమబద్ధంగా రోజూ ఉపయోగిస్తున్నాను, ఎందుచేతననగా...". తీర్పరుల నిర్ణయం అాయమైనదీ మరియు బద్ధమైనది, ఉత్తరప్రత్యుత్తరములు జరుపనంగీకరించబడదు.
6. ఎన్ని ప్రవేశపత్రములైనా పంపబడవచ్చును, కాని పాల్గొనిన ఒక వ్యక్తి ఒక్క బహుమతిని పొందుటకే అర్హుడగును. మొదటి లేక రెండవ బహుమతిని ఒకరికంటె ఎక్కువమంది గెలుపొందినయడలతరువాత దైనతక్కువ బహుమతికిసమమైన రొఖం ఎక్కువమంది గెలుపొందిన బహుమతికి సమమైన రొఖమవకు చేర్చబడి, ఈ సొమ్ము మొత్తం గెలుపుదారుకు సమంగా పంచబడును. చేర్చబడిన తక్కువ బహుమతి తొలిగించబడును. మూడవ బహుమతిని ఒకరికంటె ఎక్కువమంది గెలుపొందిన యడల రెండవ బహుమతిని ఒకరికంటె ఎక్కువమంది గెలుపొందని పక్షంలో, దానికి సమమైన రొఖమును గెలుపు దారుకు సమానంగా పంచబడును.
7. అన్ని ప్రవేశపత్రములున్ను మెస్సర్స్. బ్రిస్టి మేనర్స్ అండ్ కం. లి., వారి స్వంత ఆస్తియగును. మరియు ప్రచారం నిమిత్తం ఉపయోగించబడవచ్చును.
8. ఈ పోటీ యొక్క ఫలితములు ముఖ్యమైన దినపత్రికలలో ప్రకటింపబడును. గెలుపు వార్తలు ప్రత్యేకం వ్యక్తిగతంగా తెలుపబడుతుంది.
9. ఈ పోటీలో పాల్గొనుటకు బ్రిస్టి మేనర్స్ అండ్ కం. లి., వారి ఉద్యోగులు మరియు వారి ప్రచారం జరిపే ఏజెంట్ల యొక్క ఉద్యోగులు మరియు వారకు ఉద్యోగుల కుటుంబములందలి వ్యక్తులు తప్ప భారతదేశనివాసులందరికీ అర్హతగలదు.
10. ప్రవేశపత్రములను పంపవలసిన అంతిమ తేది మెస్సర్స్ బ్రిస్టి మేనర్స్ ఇండియా కం. లి. వారి తైక నిర్ణయమునాడం పొడిగించబడవచ్చును.

మీ ఫోర్‌హెన్స్ విక్రేతవద్ద ప్రవేశపత్రములు కూడా లభించును.

తినిని ప్రవేశపత్రముగా ఉపయోగించండి.

మహత్తరమైన ఫోర్‌హెన్స్ వినోదవిహారం పోటీ

ఎ. ఫోర్‌హెన్స్ టూత్ పేస్టుయందలి దిగువనుదహరించబడిన లక్షణములయొక్క సరియైన ప్రాముఖ్యతా క్రమమును మీ అభిప్రాయానుసారం దిగువచదరములలో వరుసప్రకారం అంకెలను వేయండి.

☐ ఫోర్‌హెన్స్ మీ పళ్లను ఆరోగ్యవంతంగాను, పరిశుభ్రంగాను ఉంచుతుంది.
☐ ఫోర్‌హెన్స్ మీ ఇగుళ్ల బాధలను నివారిస్తుంది.
☐ ఫోర్‌హెన్స్ మీ దంతతేజమును అధికపరుస్తుంది.
☐ ఫోర్‌హెన్స్ టూత్‌పేస్టు కుటుంబంలో అందరికి పరోత్తమమైనది.
☐ ఫోర్‌హెన్స్ ఒక దంతవైద్యునిచే సృష్టింపబడిన టూత్ పేస్టు.
☐ ఫోర్‌హెన్స్‌లో ఇగుళ్ల నివారణం ప్రత్యేక ఔషధ పదార్థములు గలవు
☐ ఫోర్‌హెన్స్‌ను వాడే అలవాటును ఎంత శీఘ్ర ప్రాయంలో నేర్పితే అంతమంచిది.

బి. పేరే ఒక శాసనం మీద దిగువనుదహర